నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
బుధవారం | ఆగస్టు 14, 2024 | www.navatelangana.com

రూరల్ పోలీస్ స్టేషన్లో యువకుడు ఆత్మహత్యాయత్నం

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

నిజామాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో హైదరాబాద్‌కు చెందిన రమేష్ అనే వ్యక్తి ఎస్సై ఉండే రూమ్ లోకి వెళ్లి ఫ్లెక్సీతో ఉరి వేసుకుని ఆత్మహత్యాయత్నంకు పాల్పడ్డాడు. దీంతో హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. రమేష్ ను విచారణ నిమిత్తం పోలీస్ స్టేషన్‌కు తీసువచ్చినట్లు తెలిసింది. రమేష్ ఆత్మహత్యకు గల కారణాలు తెలియలేదు. నిజామాబాద్ నగర శివారులోని రూరల్ పోలీస్ స్టేషన్ లో ఈ ఘటన జరుగడం కలకలం రేపింది. ఎస్‌హెచ్‌వోగా ఉన్న మహేష్ ను ఇటీవల బదిలీలో భాగంగా భీంగల్‌కు బదిలీ చేశారు. ఇంకా రిలీవ్ చేయలేదు. అంతలోనే ఈ అఘాయిత్యం జరగడం గమనార్హం. రమేష్‌పై పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ అయిందా లేక విచారణ నిమిత్తం రప్పించి వేదించారా? అన్న అనుమానాలు వ్యక్తమౌతున్నాయి. ఇటీవల కాలంలో సివిల్ పంచాయతీలు, భార్యభర్తల వివాదాల్లో పోలీస్ స్టేషన్‌లకు రప్పించి సెటిల్‌మెంట్లు చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్న సమయంలో రమేష్ ఆత్మ హత్యాయత్నం కలకలం రేపింది. రమేష్ ఆత్మ హత్యాయత్నంకు గల కారణాలపై పోలీసు అధికారులెవ్వరూ స్పందించలేదు.

కొవ్వొత్తులతో వైద్యుల నివాళి

నవతెలంగాణ-కామారెడ్డి


కొవ్వొత్తులతో నివాళి అర్పిస్తున్న వైద్యులు

ఈ మధ్యకాలంలో వైద్యులపై దాడులు జరగడం పరిపాటిగా మారిందని కామారెడ్డి ఐఎంఈ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు అన్నారు. కొలకత్తాలోని ఆర్ జి కె ఏ ఆర్ మెడికల్ కళాశాలలో పీజీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని తమ విధులు ముగించుకుని సెమినార్ హాల్లో నిద్రిస్తున్న సమయంలో వైద్య కళాశాలలో సెక్యూరిటీ విభాగంలో పనిచేస్తున్న వ్యక్తి ఆమెపై దాడి చేసి హత్య చేయడాన్ని నిరసిస్తూ కామారెడ్డి జిల్లా కేంద్రంలో మంగళవారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ జిల్లా కేంద్రంలోని సిరిసిల్ల రోడ్డులో గల ధర్మశాల నుండి ప్రారంభమై ప్రభుత్వ ఆసుపత్రి వరకు ర్యాలీ నిర్వహించి తమకు న్యాయం చేయాలని, వైద్యుల రక్షణ కోసం ప్రత్యేక చట్టం తేవాలని నినాదాలు చేశారు.


మొరం చదును చేస్తుండగా.. బండరాళ్లను మోస్తున్న విద్యార్థులు.. అక్కడే ఉన్న పీడీ, ఉపాధ్యాయులు

కూలీలైన విద్యార్థులు

- పిల్లలతో బండ రాళ్లు మోయించిన ఉపాధ్యాయులు
- నవీపేట్ మండల కేంద్రంలోని బాలుర పాఠశాలలో ఘటన

నవతెలంగాణ-నవీపేట్

నిజామాబాద్ జిల్లా నవీపేట్ మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యార్థులతో మొరం రాళ్లు మోయించిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. పాఠశాల ఆవరణలో వర్షం నీళ్లు నిలబడుతూ ఉండడంతో ఇబ్బందులకు గురవుతున్నారని స్థానిక ఎస్సై యాదగిరి గౌడ్ దృష్టికి ఉపాధ్యాయులు తీసుకురావడంతో పది ట్రిప్పుల మొరంను పాఠశాల ఆవరణలో పోయించారు. ఇంతవరకు బాగానే ఉన్నా పాఠశాల పీడీతో పాటు, ఉపాధ్యాయుడు జేదిద్య బ్లేడ్ ట్రాక్టర్‌తో ఆవరణలో చదును చేయించారు. కాగా మొరంలో పెద్ద పెద్ద రాళ్లు ఉండడంతో విద్యార్థులతో మోయించారు. పాఠశాల ఎదుటే బస్టాండ్ ఉండడంతో స్థానికులు, ప్రయాణికులు చూసి విద్యార్థులతో ఉపాధ్యాయులు దగ్గరుండి రాళ్లు మోయించడమేంటని నోరెళ్లబెట్టారు. కాగా అటుగా వెళ్తున్న నవతెలంగాణ విలేకరి 'క్లిక్' మనిపించడంతో ఉపాధ్యాయులు అలర్ట్ అయి విద్యార్థులను అక్కడి నుంచి పంపేశారు. విద్యాబుద్ధులు నేర్చుకుంటారని స్కూల్‌కు పంపిస్తే.. వారిని కూలీ లెక్క పెద్దపెద్ద బండరాళ్లు మోపించడం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడుతున్నారు. దాదాపు పది టిప్పర్ల మొరం వస్తే.. వాటిల్లోని పెద్దపెద్ద బండరాళ్లను విద్యార్థులతోనే తీసివేయించడం గమనార్హం. పిల్లలు అనారోగ్యాలకు ఏదైనా అయితే ఎవరు బాధ్యత వహిస్తారని స్థానికులు మండిపడుతున్నారు.

క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో
కార్మిక, రైతు హక్కులను కాపాడుకుందాం

- నేడు అర్ధరాత్రి వరకు జన జాగరణ జయప్రదం చేయండి : జాయింట్ ప్లాట్ఫామ్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ అండ్ సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు

నవతెలంగాణ-కంఠేశ్వర్



మాట్లాడుతున్న నాయకులు

క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో కార్మిక, రైతు హక్కులను కాపాడుకుందాం అని జాయింట్ ప్లాట్ఫామ్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ అండ్ సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు నిచ్చింది. నేడు (14న) అర్ధరాత్రి వరకు జన జాగరణను జయప్రదం చేయాలని కోరింది. ఈ మేరకు మంగళవారం ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో ఆల్ ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆగస్టు 14న రాత్రి 8 గంటలకు సాయి రెడ్డి పెట్రోల్ బంకు వద్ద భగత్ సింగ్ విగ్రహం వద్ద, కాగడాల ప్రదర్శన చేపట్టనున్నామని, జన జాగరణ ను కార్మికులు రైతులు వ్యవసాయ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్, ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి వై ఓమయ్య, ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, జిల్లా ఉపాధ్యక్షులు శివ మాట్లాడుతూ.. మోడీ, మాట్లాడుతూ ప్రభుత్వం సామాన్యులకు మాటల్లో, సంపన్నులకు కార్పొరేట్లకు మూటలు వడ్డించే విధంగా మోడీ ప్రభుత్వం కేంద్రంలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందని అన్నారు. అత్యంత కీలకమైన వ్యవసాయం, పారిశ్రామిక రంగానికి ఈ బడ్జెట్‌లో ప్రాధాన్యత ఇవ్వలేదని, అన్ని రంగాల్లో కార్పొరేట్లకే పెద్దపీట వేసిందని, ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలను ప్రైవేటీకరించకుండా పటిష్ట పరిచే చర్యలు నిర్దిష్టంగా ప్రకటించలేదని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రవేటికరణల్లో భాగంగానే సింగరేణి 61 బ్లాక్ లను ప్రైవేటు సంస్థలు కట్టబెట్టే ప్రక్రియను చేపట్టిందని, అందులో భాగంగానే తెలంగాణలో ప్రతిష్టాత్మకమైన సింగరేణి శ్రావణపల్లి బ్లాకును(మంచిర్యాల వేలం వేయడానికి సిద్ధపడిందని తెలియజేశారు. కేంద్ర బడ్జెట్లో తెలంగాణ రాష్ట్రానికి లాభం చేకూర్చే ఏ చర్య తీసుకోకుండా, మోడీ ప్రభుత్వం మరోసారి మోసం చేసిందని, స్కీం వర్కర్స్‌ను కార్మికులుగా గుర్తించలేదని, అసంఘటితరంగ కార్మికుల సంక్షేమం పట్టించుకోలేదని రైతులకు కనీస మద్దతు ధర గ్యారెంటీ ఇవ్వలేదని, సుదీర్ఘ రైతు పోరాట ఫలితంగా రద్దు చేసిన రైతు చట్టాలను హామీ మేరకు నిర్దిష్ట చర్యలు తీసుకోలేదని, గ్రామీణ ఉపాధి హామీని బలోపేతం చేసే రకంగా చర్యలు చేపట్టలేదని, అనేక త్యాగాలు, రక్త తరుపనతో పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్లుగా మారుస్తూ పార్లమెంట్లో చట్టం చేసిందని, వేతనాలకోడు చట్టంతో కనీస వేతనాలు నిర్ణయించే మౌలిక విధానానికి తూట్లు పొడిచిందని అన్నారు.

సామాజిక భద్రత కోడు వృత్తి సంబంధ రక్షణ, ఆరోగ్యం, పని పరిస్థితుల కోడ్లతో పిఎఫ్, ఈఎస్ఐ, వెల్ఫేర్ బోర్డ్ లపై గొడ్డలి వేటు వేస్తుందని, తిరిగి 12 గంటల పని విధానం అమల్లోకి తెస్తుందని, కాంట్రాక్టు లేబర్ విధానం అన్ని రంగాల్లో మరింత పెరిగి దోపిడికి హద్దే లేకుండా ఉందని సుమారు 40 కోట్ల మంది అసంఘటితరంగా కార్మికులకు ఈ లేబర్ కోడ్లతో బానిసత్వంలోకి నెడుతుందని తెలిపారు. ప్రభుత్వ స్కీముల్లో కోటి మంది స్కీం వర్కర్లకు ఉద్యోగ భద్రత, కనీస వేతనానికి నోచుకోవడం లేదని, ఇండియన్ లేబర్ కాంగ్రెస్(ఐ ఎల్ సి) కార్మిక సంక్షేమం కోసం గతంలో చేసిన తీర్మానాలన్నీ చిత్తుకాగితాలకే పరిమితమైన్నాయని విమర్శించారు.

కార్మిక, రైతు, వ్యతిరేక కేంద్ర బడ్జెట్‌ను సవరించాలని, దేశంలో అత్యధిక ధనవంతులకు కార్పొరేట్ వర్గాలకు ఆదాయ సంపదపై టాక్స్ పెంచి విద్యా ఆరోగ్యం వ్యవసాయ రంగాల కేటాయించాలన్నారు. నాలుగు లేబర్ కోడ్లను విద్యుత్ సవరణ బిల్లును 2002 రద్దు చేయాలని, 73 షెడ్యూల్డ్ పరిశ్రమల జివోలను సవరించి పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని, బొగ్గు బ్లాకులు వేలం వేయడాన్ని నిలుపుదల చేయాలని, సింగరేణికే నేరుగా గనులు కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. కార్మికులకు 26,000 కనీస వేతనం అమలుపరచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐ ఎఫ్ టి యు జిల్లా నాయకులు వెంకటి నాయకులు పాల్గొన్నారు.

బాలికల హాస్టల్లో ఏసీబీ తనిఖీ


సరుకుల వివరాలు నమోదు చేస్తున్న ఏసీబీ అధికారులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని కోటగల్లి బాలికల (ఎస్సీ) సంక్షేమ హాస్టల్‌లో ఏసీబీ అధికారులు మంగళవారం తెల్లవారుజామున తనిఖీలు నిర్వహించారు. ప్రభుత్వం ప్రతి ఏటా ఇచ్చే సంక్షేమ ఫలాలు వసతి గృహ విద్యార్థినిలకు అందుతున్నాయా లేవా అని కోణంలో తనిఖీలు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలుపుతున్నారు. హాస్టల్ విద్యార్థులకు నాణ్యమైన భోజనం, నోట్ పుస్తకాల పంపిణీ, దుప్పట్ల పంపిణీ, పరిసరాల పరిశుభ్రత, వార్డెన్లు అందుబాటులో ఉంటున్నాయా లేదా అనే కోణంలో పరిశీలించారు. మంగళవారం తెల్లవారుజామున ఏసీబీ అధికారులు హాస్టల్లో తనిఖీలకు వెళ్లడం నిజామాబాద్ జిల్లా కేంద్రంలో కలకలం రేపుతుంది.

గతవారం మున్సిపల్ ఇన్చార్జి రెవెన్యూ ఆఫీసర్ ఇంటిలో ఆదాయానికి మించి ఆస్తుల కేసులో తనిఖీలు చేసిన ఏసీబీ ఈసారి హాస్టల్‌లో సోదాలు చేయడం వసతి గృహ అధికారుల గుండెల్లో రైళ్లను పరిగెత్తించింది. హాస్టల్‌లలో విద్యార్థులకు సంక్షేమ ఫలాలు అందించకుండానే దొంగ బిల్లులు పెట్టి నిధులను కాజేస్తున్నారనే ఆరోపణల నేపథ్యంలో ఏసీబీ అధికారులు రాష్ట్ర వ్యాప్తంగా తనిఖీలలో భాగంగా నిజామాబాద్ జిల్లా కేంద్రంలో తనిఖీలు చేస్తున్నట్లు సమాచారం. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఏసీబీ తనిఖీలు ఇతర ప్రభుత్వ శాఖల అధికారులను అలజడి రేపుతుంది. హాస్టళ్లలో ఆహారం సహా సౌకర్యాల ఇతర విషయాలపై ఆకస్మిక సోదాలు చేస్తున్నారు. వసతి గృహంలో విద్యార్థులకు అందుతున్న ప్రభుత్వ ప్రయోజనాల తీరును పరిశీలిస్తున్నారు. కొంత కాలంగా ప్రభుత్వ వసతి గృహాల్లో నాణ్యమైన భోజనం పెట్టడం లేదన్న ఫిర్యాదుల మీద దాడులు చేస్తున్నట్లు తెలిసింది. ఈ దాడులు స్వయంగా నిజామాబాద్ ఏసీబీ డిఎస్పీ శేఖర్ నేతృత్వంలో జరిగాయి. ఆయన వెంట నిజామాబాద్ ఏసీబీ సిఐలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు

- నవతెలంగాణ వార్తకు స్పందన


కంకర, డస్ట్‌తో గుంతలను పూడ్చివేత

నవతెలంగాణ ఎఫెక్ట్

నవతెలంగాణ-బోధన్

బోధన్ మండలం నాగన్ పల్లి గ్రామం వద్ద పాత వంతెన పై నుంచి ఊరి బస్టాండ్ వరకు అంతరాష్ట్ర రహదారి పెద్ద పెద్ద గుంతలతో ప్రయాణికులకు ఇబ్బందికరంగా మారడంతో ఈ నెల 7వ తేదిన "ఎమ్మెల్యే సారు.. జరా ఇటువైపు కన్నెత్తి చూడరా" అంటు వార్త ప్రచురితం అయింది. నవతెలంగాణ దినపత్రికలో ఈ వార్త రావడంతో ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి సంబంధిత శాఖ అధికారులను పిలిచి రోడ్డు దుస్థితిపై వివరణ కోరినట్లు సమాచారం. తక్షణమే గుంతలమయమైన రోడ్డును గుంతలుపూడ్చి మరమ్మతులు చేయాలని ఆదేశించడంతో మంగళవారం నేషనల్ హైవే అధికారులు సిమెంట్ కంకరతో గుంతలు పూడ్చి మరమ్మతులు చేశారు. ఈ సంధర్భంగ నేషనల్ హైవే ఈఈ గడ్డం దుర్గయ్య మాట్లాడుతూ నేషనల్ హైవే విభాగం అధికారులు బదిలీలు కావడంతో మరమ్మతులకు ఆలస్యం అయిందని, తాను విధులలో చేరగానే ఎమ్మెల్యే ఆదేశాలతో నాగన్ పల్లి రోడ్డును పరిశీలించి మరమ్మతులు చేయిస్తున్నామని నవతెలంగాణ ప్రతినిధితో పేర్కొన్నారు.

అవుట్‌సోర్సింగ్ ఏఎన్‌ఎంలకు
పెండింగ్ వేతనాలు చెల్లించాలి

- సీఐటీయూ ఆధ్వర్యంలో డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయం ఎదుట నిరసన
- అసిస్టెంట్ కలెక్టర్, డీఎంవోకు వినతి

నవతెలంగాణ-కామారెడ్డి


వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు, ఏఎన్ఎంలు

కామారెడ్డి జిల్లాలో పని చేస్తున్న 44 మంది అవుట్‌సోర్సింగ్‌లో ఏఎన్‌ఎంలకు నాలుగు నెలలుగా వేతనాలు అందడం లేదని, పీఎఫ్ డబ్బులు తమ వేతనాల్లో కట్ అవుతున్నా అకౌంట్‌లో మాత్రం జమ కావడం లేదని అవుట్‌సోర్సింగ్ ఏఎన్ఎంలు ఆవేదన వ్యక్తం చేశారు. తమ పెండింగ్ వేతనాలు చెల్లించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం డీఎంఅండ హెచ్‌వో కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. అనంతరం జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డికి ఇంచార్జి డీఎంహెచ్ చంద్రశేఖర్‌కు వినతి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ మధ్య ఏజెన్సీలు మారాయని తమకు వేతనాలను ఆలస్యం చేస్తున్నారన్నారు. మేము ఉద్యోగంలో చేరిన సమయంలో శ్రీ మిత్ర ఏజెన్సీ రెండు సంవత్సరాల రెండు నెలలు కొనసాగిందని ఆ తర్వాత వీరభద్ర ఏజెన్సీ వచ్చిందన్నారు. గత కొన్ని నెలలుగా పిఎఫ్ చేసే జమ చేయడం లేదని, తమ వేతనాల్లో మాత్రం కోత విధిస్తున్నారన్నారు. తమకు ఏప్రిల్ మే జూన్ జూలై నెల వేతనాలు రావాల్సి ఉందన్నారు. తాము అద్దె ఇంట్లో ఉంటున్నామని, నేల నిండగానే ఇంటి అద్దాలు చెల్లించవలసి ఉంటుందని నాలుగు నెలలుగా వేతనాలు రాకపోవడంతో మేము పస్తులు ఉండవలసిన పరిస్థితులు ఏర్పడుతు న్నాయి అన్నారు.


డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయంలో బైటాయించిన నాయకులు, ఏఎన్ఎంలు

మిత్ర ఏజెన్సీ ఈఎస్ఐ డబ్బులు బాకీ ఉందని వారు కట్టనేలేదని ఆ ఏజెన్సీ నుండి డబ్బులు కట్టించాలని అధికారులను కోరారు. ప్రతినెల ఐదో తారీకు వరకు తమ వేతనాలు వచ్చేలా ఏజెన్సీ నిర్వాహకులకు ఆదేశించాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియూ జిల్లా కన్వీనర్ చంద్ర శేఖర్, నాయకుల కొత్త నరసింహులు, ఏఎన్ఎంలు రజిత, శృతి, భాగ్యలక్ష్మి సుధారాణి, స్వరూప, వాణిశ్రీ లతోపాటు 44 మంది ఏ నెలలో పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకోవాలి

- స్వాతంత్ర్య సమరయోధుల ఫోటో ఎగ్జిబిషన్ ప్రారంభించిన అడిషనల్ కలెక్టర్, మేయర్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ


సమయయోధుల ఫోటోలు, వారి వివరాలు ఏర్పాటు

స్వాతంత్ర్య పోరాటాన్ని, స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకోవడం నేటి యువతకు చాలా అవసరం అని నిజామాబాద్ మున్సిపాలిటీ మేయర్ నీతూ కిరణ్ సూచించారు. మంగళవారం నిజామాబాద్ గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఆధ్వర్యంలో తెలుగు స్వాతంత్ర్య సమరయోధుల ఫోటో ఎగ్జిబిషన్‌ను నిజామాబాద్ మున్సిపాలిటీ మేయర్ నీతు కిరణ్, అసిస్టెంట్ కలెక్టర్ సంకేత్ కుమార్ ఐఏఎస్ సంయుక్తంగా రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (సీబీసీ), కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్ 14వ తేదీ వరకు కొనసాగుతుంది. ప్రముఖ తెలుగు స్వాతంత్ర్య సమరయోధుల పై ఫోటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (సీబీసీ)ని నిజామాబాద్ మున్సిపాలిటీ మేయర్ నీతూ కిరణ్, అసిస్టెంట్ కలెక్టర్ సంకేత్ కుమార్ ఐఏఎస్, జిల్లా అధికారులు అభినందించారు.

బహుమతులు ప్రదానం

ఫోటో ఎగ్జిబిషన్‌పై నిర్వహించిన వ్యాసరచన, ఉపన్యాస పోటీల్లో విజేతగా నిలిచిన విద్యార్థులకు ముఖ్య అతిథిలు చేతులు మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో అనంతరం సిబిసి ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ బి ధర్మానాయక్, గిరిరాజ్ గవర్నమెంట్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.పి.రామ్ మోహన్ రెడ్డి, జిల్లా మహిళా సంక్షేమ అధికారి ఎస్.కె.రసూల్ బీ, జిల్లా యువజన అధికారి శైలి బెల్లాల్, తెలంగాణ యూనివర్సిటీ ఎన్ ఎస్ ఎస్ కోఆర్డినేటర్ రవీంద్రారెడ్డి, ఆకాశవాణి ట్రాన్స్మిషన్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మోహన్ దాస్, అధ్యాపకులు, ఎన్ సీసీ క్యాడేట్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్గో ఏజెంట్ల కోసం దరఖాస్తులు ఆహ్వానం

- ఆర్టీసీ ఆర్ఎం జాన్‌రెడ్డి
- రాఖీలను పంపేందుకు ఆర్టీసీని ఉపయోగించుకోవాలని సూచన

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

తెలంగాణ రాష్ట్ర ఆర్‌టిసి కార్గోసేవా విభాగం ద్వారా నడపబడుతున్న ఆర్‌టిసి కార్గోలో ఏజెంట్లను నియమించుటకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నాము అని ఆర్టీసి జానీ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్‌టిసిలో రిటైర్డ్ ఐనా ఎంప్లాయీస్‌కి ఏజెంట్లుగా నియమించుటకు ప్రిపరెన్స్ ఇవ్వబడుతోందని, ఉమ్మడి నిజామాబాదు జిల్లా వాసులు, జిల్లా వ్యాప్తంగా వస్తువులు ఇతర ప్రాంతాలకు బుక్ చేయడం, ఇతర ప్రాంతాలనుండి వచ్చిన వస్తువులను కస్టమర్స్‌కి అందించడంలో ఏజెంట్లను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఉమ్మడి జిల్లా నిజామాబాద్ వ్యాప్తంగా వస్తువులు చేరవేయడంలో భాగంగా మండల కేంద్రాలు, పట్టణ కేంద్రాలలో కార్గో ఏజెంట్ల నియామకానికి దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు. సెక్యూరిటీ డిపోజిట్ల కింద గ్రామ, మండలస్థాయిలో రూ.1000, జిల్లా స్థాయిలో రూ. 5000 డిపాజిట్ చేయాలని సూచించారు. అన్నాచెల్లెళ్ళ అనుబంధానికి వారధిగా టి.ఎస్.ఆర్.టి.సి. కార్గో కొరియర్ ద్వారా మీప్రేమాను రాగాలు నింపిన రాఖీలు, స్వీట్లు అతితక్కువ ఖర్చుతో వేగంగా, భద్రంగా రవాణా చేయబడుతుందని, అందుకు ఉమ్మడి జిల్లా నిజామాబాద్ జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పూర్తి వివరాలకు ఆర్మూర్ డిపో - 7396889496, బోధన్ డిపో- 9014296638, నిజామాబాద్-1 డిపో-9154298727, నిజామాబాద్-2 డిపో-7396889496, బాన్సువాడ డిపో-9154298729, కామారెడ్డి డిపో-9154298729, ఆర్. యం. ఆఫీసు- 8639963647 నెంబర్ లకు సంప్రదించాలని సూచించారు.

ఉద్యమ సమయం నుంచి
మీ వెంటే ఉన్నాం.. ఉంటాం

- బాన్సువాడకు ఉప ఎన్నికలు తథ్యం
- కేటీఆర్‌ను కలిసిన బాన్సువాడ బీఆర్ఎస్ నాయకులు


బాన్సువాడ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలో మాట్లాడుతున్న కేటీఆర్

నవతెలంగాణ-బాన్సువాడ (నరుసురుల్లాబాద్)

'ఉద్యమ సమయం నుంచి మీ వెంటే ఉన్నాం. ఎలాంటి పరిస్థితుల్లోనైనా మీ వెంటే ఉంటూ మీ నాయకత్వంలో ముందుకు వెళ్తాం' అని బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అన్నారు. బాన్సువాడ నియోజకవర్గ నాయకులు కార్యకర్తలు మంగళవారం మాజీ మంత్రి, ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను హైదరాబాద్‌లో కలిసారు. ఈ సందర్భంగా వారితో కేటీఆర్ మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ నుండి గెలుపొంది కాంగ్రెస్‌లో చేరిన పోచారం శ్రీనివాస్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీకి మోసం చేశారని, బాన్సువాడలో ఉప ఎన్నికలు ఖాయమని తెలిపారు. కష్ట కాలంలో పార్టీకి ద్రోహం చేసిన వాళ్ళ ఎంత పెద్ద వాళ్లైనా సరే వదిలిపెట్టేది లేదని వారికి కచ్చితంగా కార్యకర్తలు బుద్ధి చెప్పాలని త్వరలోనే ప్రశాంత్ రెడ్డి, ఇతర పార్టీ సీనియర్ నాయకులు సహా తాను బాన్సువాడలో పార్టీ శ్రేణులతో సమావేశం ఏర్పాటు చేస్తామని కేటీఆర్ హామీ ఇచ్చారని బాన్సువాడ నాయకుడు షేక్ జుబెర్ తెలిపారు. పార్టీని మోసం చేసి నాయకులు వెళ్లిపోయినప్పటికీ కార్యకర్తలు మాత్రం పార్టీ వీడలేదని, గులాబి జెండా మీద గెలిచిన పోచారం శ్రీనివాస్ రెడ్డి పార్టీ వీడినా.. గ్రామాల్లో ఉన్న పార్టీ కార్యకర్తలంతా బీఆర్ఎస్ పార్టీతోనే ఉన్నారని పార్టీ శ్రేణులు కేటీఆర్‌కు సూచించినట్లు తెలిపారు. బాన్సువాడ బీఆర్ఎస్ కార్యకర్తలకు తాను అండగా ఉంటానని కేటీఆర్ భరోసా ఇచ్చారని తెలిపారు.

వర్క్‌ఫ్రం హోం జాబ్ పేరిట సైబర్ మోసం

బ్యాంక్ ఖాతాలో నుంచి రూ.1.38 లక్షలు మాయం

నవతెలంగాణ-బాన్సువాడ(నసురుల్లాబాద్)

సైబర్ మోసాల పట్ల తరుచూ అవగాహన కల్పిస్తున్నా. ప్రజలు ఏదో ఒక రూపంలో మోసపోతూనే ఉన్నారు. అటు పోలీస్‌శాఖతో పాటు ఇట పత్రికలు వివిధ రూపాల్లో జరుగుతున్న మోసాలను ఎప్పటికప్పుడు తెలియజేస్తున్నా పలువురు బాధితులు మోసపోతూనే ఉన్నారు. సైబర్ నేరగాళ్ల సైతం ప్రజల్ని మోసగించేందుకు ఏ ఒక్క అవకాశాన్నీ వదలడం లేదు. మారుతున్న పరిణామాలు.. తాజా అంశాలను ఆసరాగా చేసుకుని డబ్బు కాజేసేందుకు ప్రయత్నిస్తున్నారు.

తాజాగా బాన్సువాడ మండలంలోని తడకోల్ తడ్కోల్ గ్రామానికి చెందిన ఓ యువకుడు సైబర్ నేరగాళ్ల మోసానికి రూ.1,38,200 పోగొట్టుకున్నాడు. బాన్సువాడ టౌన్ సీఐ కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని తాడ్కోలుకు చెందిన అంకం విష్ణువర్ధన్‌కు ముందుగా వాట్సాప్‌లో ఉద్యోగం పేర ఓ మెసేజ్ రావడంతో ఆన్‌లైన్ ఉద్యోగం కోసం దరఖాస్తు చేసుకున్నాడు. జూలై 29న డేటా ఎంట్రీ ఉద్యోగం వచ్చిందని వాట్సాప్‌లో లింక్ పంపించారు. ఈ నెల 10న యువకుడు వివరాలు పూర్తిచేసి తిరిగి పంపించాడు. కాగా నీవల్ల మా సంస్థకు నష్టం వాటిల్లిందని చెప్పి కేసు నమోదు చేస్తామని బెదిరించారు. కోర్టుకు పిలిచినప్పుడు రావాలని యువకుడిని భయపెట్టారు. రిజిస్ట్రేషన్ ఛార్జీల పేరిట డబ్బులు కావాలని మోసగాళ్ల డిమాండ్ చేశారు. కోర్టులో కేసు మాఫీ చేస్తామని దానికి ఖర్చులను పంపాలని డిమాండ్ చేశారు. నేరగాళ్ల భయానికి భయ పడి విడతల వారీగా రూ.1.38 లక్షలు బ్యాంకు ఖాతాలో జమ చేశాడు. సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి మోసపోయినట్లు గుర్తించి 1930 నంబర్‌కు ఫిర్యాదు చేశాడు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉంటూ, గుర్తుతెలియని ఉత్తరాలు, మేసేజ్‌లు వచ్చిన వాటికి స్పందించవద్దని, గుర్తు తెలియని వ్యక్తుల మాయమాటలు నమ్మి మోసపోవద్దని బాన్సువాడ టౌన్ సిఐ కృష్ణ తెలిపారు. బాధితుడు ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కృష్ణ తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్లు చోరీ



ట్రాన్స్‌ఫార్మర్ నుంచి ఆయిల్ చోరి చేసిన దుండగులు

నవతెలంగాణ-నవీపేట్

మండల కేంద్రంలోని దర్యాపూర్ శివారులో సోమవారం రాత్రి రెండు ట్రాన్స్‌ఫార్మర్లలో ఆయిల్, కాయిల్స్‌లను గుర్తుతెలియని దుండగులు చోరీ చేసినట్లు రైతులు మంగళవారం తెలిపారు. మండల కేంద్రం నుండి సాటపూర్ వెళ్లే రోడ్డులో గల రెండు ట్రాన్స్‌ఫార్మర్ల నుండి ఆయిల్ కాయిల్స్‌లను దొంగతనం చేయడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో ట్రాన్స్‌ఫార్మర్లతో పాటు కేబుల్ వైర్ల దొంగతనాలు తరచూ జరుగుతున్న పోలీసులు మాత్రం నిమ్మకు నేరెత్తనట్లు వ్యవహరిస్తున్నారని అన్నారు. దొంగలను పట్టుకోవడంలో పోలీసులు నిర్లక్ష్యం వహిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై రైతులు మంగళవారం పోలీసులను ఆశ్రయించారు.

తపాల స్కీమ్‌లను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-డిచ్‌పల్లి



మాట్లాడుతున్న పలువురు

తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని తపాలా కార్యాలయం వారి ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా సుస్మిత బెనర్జీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోస్టాఫీసు నిజామాబాద్ సౌత్ సబ్ డివిజన్ తపాలా కార్యాలయం అందిస్తున్న వివిధ రకాల పథకాలపై వివరించారు. స్కీములు, సేవింగ్ ఖాతాలు, ఇన్సూరెన్స్ స్కీములు, జన సురక్ష స్కీంలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పోస్టల్ సిబ్బంది తెలంగాణ వర్సిటీ సబ్ పోస్ట్ మాస్టర్ పి. చరణ్, బి. స్నేహిత్, ఎన్ సుశాంత్,మంతెన రవి, టీచింగ్,నాన్ టీచింగ్, ఔట్సోర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

పరీక్షలు ప్రశాంతం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని బిఎడ్ నాల్గవ సెమిస్టర్ రెగ్యులర్ పాటుగా ఒకటి, రెండు, మూడు, నాల్గవ సెమిస్టర్ బ్యాక్ లాగ్ పరీక్షలు గిరిరాజ్ గవర్నమెంట్ కాలేజ్ నిజామాబాద్, ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల కామారెడ్డి, ఎస్ఆర్ఎన్‌కె గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ బాన్సువాడ గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ ఆర్మూర్ పరీక్ష కేంద్రాల్లో మొదటిరోజు ప్రశాంతంగా జరిగాయి. మంగళవారం ఉదయం జరిగిన పరీక్షకు 86 మంది విద్యార్థులకు 78 మంది విద్యార్థులు హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన పరీక్ష కు 1308 మంది విద్యార్థులకు 1268 మంత్రి విద్యార్థులు హాజరయ్యారు. 40మంది విద్యార్థులు గైరాజరయ్యారని ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ ఘంటా చంద్రశేఖర్ తెలిపారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

- రూ 20వేల జరిమానా



టిప్పర్ పట్టివేత

నవతెలంగాణ-నవీపేట్

మండల కేంద్రంలో అక్రమంగా తరలిస్తున్న ఇసుక టిప్పర్ ను తహసిల్దార్ నారాయణ సిబ్బందితో కలిసి సోమవారం రాత్రి పట్టుకున్నారు. మండలం నుండి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న టిప్పర్ ను పట్టుకొని పోలీసులకు అప్పగించారు. టిప్పర్ యజమానికి మంగళవారం 20వేల జరిమానా విధించినట్లు తెలిపారు. అక్రమంగా మొరం, ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు ఉంటాయని ఈ సందర్భంగా ఎమ్మార్వో నారాయణ తెలిపారు.

మోతే సొసైటీలో రైతు రుణమాఫీ చెక్కుల పంపిణీ



చెక్కులు అందజేస్తున్న చైర్మన్

నవతెలంగాణ-(వేల్పూర్)ఆర్మూర్

మండలంలోని మోతే ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో మంగళవారం ఏడుగురు రైతులకు రుణమాఫీ చెక్కుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ రాజేశ్వర్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో సీఈఓ రాజేశ్వర్, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

చిన్నపాటి వర్షానికే చిత్తడి



గుంతలమయంగాట మారిన రోడ్డు

నవతెలంగాణ-ఆర్మూర్

చిన్న పాటి వర్షానికే పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద రోడ్డుపై నీరు నిలిచిపోయి పాదాచారులకు, వాహన దారులకు ఇబ్బందికరంగా మారింది. వర్షం పడితే నీరు నిలిచిపోవడమే కాకుండా రోడ్డు గుంతలుగా మారి ఏర్పడకుండా ఉండడంతో చాలాసార్లు ద్విచక్ర వాహనాల వారు పడిపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్కడ నీరు నిల్వ ఉండకుండా గుంతలను పూడ్చేయాలని ప్రజలు కోరుతున్నారు.

మున్సిపల్ సాధారణ సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య శ్రీనివాస్

నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపాలిటీలో సాధారణ సర్వసభ్య సమావేశం మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశానికి మున్సిపల్ చైర్ పర్సన్ లావణ్య శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మున్సిపాలిటీ అభివద్ధికి తాము కషి చేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజు, వైస్ చైర్మన్ షేక్ మున్ను, కౌన్సిలర్లు ఇట్టెడి నర్సారెడ్డి, ఆకుల రాము, చాలా ప్రసాద్, అధికారులు పాల్గొన్నారు.

ఆరోగ్యమేళాను సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ రాజశ్రీ

నవతెలంగాణ-డిచ్‌పల్లి



ప్రజలందరూ ఆరోగ్యమేళాను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ రాజశ్రీ పేర్కొన్నారు. మంగళవారం మండలం లోని దర్మారం (బీ)లో ఆరోగ్యమేళాను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రాజశ్రీ సందర్శించారు. ఈ ఆరోగ్య మేళాలు ఆయుష్మాన్ భారత్ కార్యక్రమాల కింద ప్రతినెల రెండవ శనివారం రోజున ప్రత్యేక వైద్య నిపుణులతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలందరూ ఈ ఆరోగ్యమేళాను ఉపయోగించు కోవలని కోరారు. స్త్రీ వైద్య నిపుణురాలు గైనకాలజీ సమస్యలకు స్కానింగ్ చేసి చికిత్స అందించారు. దంతవైద్య నిపుణులు పరీక్షలు చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్ఓ తుకారాం రాథోడ్,ఇందల్ వాయి ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు సంతోష్ కుమార్ తోపాటు వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆయిల్‌ఫాం సాగుపై మొగ్గుచూపాలి

- ట్రైనీ కలెక్టర్ అజ్మీరా సంకేత్‌కుమార్
- ఉద్యాన తోటలు సందర్శన



ఆయిల్‌ఫాంను పరిశీలిస్తున్న ట్రైని కలెక్టర్ అజ్మీరా సంకేత్‌కుమార్

నవతెలంగాణ-ఆర్మూర్

ఉద్యాన తోటల సందర్శన కార్యక్రమంలో భాగంగా జిల్లా ట్రైనీ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, జిల్లా ఉద్యాన పట్టు పరిశ్రమ శాఖ అధికారి బండారి శ్రీనివాస్ మండలంలోని అంకాపూర్ ,పెర్కిట్, చేపూర్ గ్రామాలలోని రైతుల తోటలను సందర్శించినట్లు నియోజకవర్గం ఉద్యాన శాఖ అధికారి కె.సంధ్య రాణి మంగళవారం తెలిపారు. పెర్కిట్ భూమన్న, మారచిన్న గంగారెడ్డి ఆయిల్ పామ్ తోటలను, లోక దశరథ్ రెడ్డి డ్రాగన్ ఫ్రూట్స్ తోటలను సందర్శించారు. ప్రూన్యూ కంపెనీ ప్రైవేట్ ఆయిల్ ఫామ్ డిజిఎం మల్లేశ్వరరావు, ఏరియా మేనేజర్ రోహిత్ క్లస్టర్ ఆఫీసర్ రాకేష్ రైతులు పాల్గొనగా ఆయిల్ ఫామ్ పంట సాగు, లాభాల గురించి రైతులతో వివరంగా చర్చించారు. బిందు సేద్య పథకం యాజమాన్య పద్ధతులు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ రాయితీ ప్రోత్సాహకాలను అధికారులను అడిగారు. చివరిగా చేపూర్ గ్రామంలోని నర్సరీని సందర్శించారు. జిల్లా కు విధించిన లక్ష్యం గురించి రెండు సంవత్సాలుగా పంట సాగు చేసిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. జిల్లా రైతులు ఆయిల్ ఫామ్ పంట సాగు వైపు మొగ్గుచూపాలని కోరారు. రైతులు పాల్గొన్నారు.

పట్టణంలో విద్యార్థుల భారీ తిరంగా ర్యాలీ



మాట్లాడుతున్న పలువురు

నవతెలంగాణ- ఆర్మూర్

భారతీయ జనతా యువమోర్చా పట్టణ, మండల శాఖ ఆధ్వర్యంలో హర్ గర్ తిరంగా యాత్రలో భాగంగా పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా నుండి దాదాపు కిలోమీటర్ వరకు వెయ్యి మీటర్ల త్రివర్ణ పతాకంతో దాదాపు 1000 మంది విద్యార్థులతో భారీ తిరంగా ర్యాలీ మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాయకుడు సంతోష్ జిల్లా ప్రధాన కార్యదర్శి జీవీ నరసింహారెడ్డి రాష్ట్ర నాయకుల మాజీ మున్సిపల్ చైర్మన్ కంచెట్టి గంగాధర్ జిల్లా అధికార ప్రతినిధి జెస్సు అనిల్ పట్టణ అధ్యక్షుడు ద్యాగా ఉదయ్ కౌన్సిలర్లు ఆకుల శ్రీనివాస్, సుంకరి రంగన్న , బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి మందుల బాలు బీజేవైఎం పట్టణ అధ్యక్షులు కలిగోట ప్రశాంత్, నరేష్ చారి బిజెపి సీనియర్ నాయకులు, వివిధ మోర్చాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయ సంఘం కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన కార్యవర్గం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

కమ్మర్‌పల్లి మండల సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయ సంఘం నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కేంద్రంలో నిర్వహించిన సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుల మండల స్థాయి కార్యవర్గ సమావేశం జిల్లా కన్వీనర్ ఎం. వెంకటరమణ, జిల్లా కో కన్వీనర్ గంగా ప్రసాద్ ఆధ్వర్యంలో కార్యవర్గాన్నిఎన్నుకున్నారు. సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయ సంఘం మండల అధ్యక్షులుగా పసుపుల ప్రసాద్(మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, ప్యాట హాసకొత్తూర్), మండల ప్రధాన కార్యదర్శిగా లక్ష్మ సంతోష్ (మండల పరిషత్ ప్రాథమిక బాలికల పాఠశాల, చౌట్ పల్లి), మండల ఉపాధ్యక్షులుగా గుర్రాల రాధా కిషన్ (మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, నర్సాపూర్), మండల కోశాధికారిగా గుజ్జేటి రవీందర్ (మండల పరిషత్ ప్రాథమిక బాలికల పాఠశాల, కమ్మర్ పల్లి), మండల కార్యవర్గ సభ్యులుగా వేణుగోపాల్ (మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, ప్యాట హాస కొత్తూర్), సున్నం శ్రీనివాస్, సింగరి రాజేశ్వర్, జి.శ్యామల (మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, కమ్మర్‌పల్లి) ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో

ఉపాధ్యాయ సంఘాలకు అతీతంగా మండలంలోని సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి రూ.25వేల విరాళం



విరాళం అందజేస్తున్న పలువురు

నవతెలంగాణ-నవీపేట్

మండలంలోని నాలేశ్వర్ గ్రామంలో అతి పురాతనమైన శివాలయం మరమత్తు పనులకు బినోల సొసైటీ చైర్మన్ మగ్గరి హన్మాన్లు గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులకు 25వేల విరాళాన్ని మంగళవారం అందించారు. ఆలయ మరమ్మత్తులో భాగంగా ప్రహరీ గోడ నిర్మాణానికి తన వంతు సహకారం అందించడం సంతోషంగా ఉందని సొసైటీ చైర్మన్ మగ్గరి హన్మాన్లు తెలిపారు. కార్యక్రమంలో విడీసీ సభ్యులు సురేష్, స్వామి, సుధాకర్, మోహన్, కిషన్, పోతన్న తదితరులు ఉన్నారు.

కాంతి హైస్కూల్లో విద్యార్థులకు ఎన్నికల నిర్వహణ



ఓటు వేస్తున్న విద్యార్థినిని

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణం లోని కాంతి హై స్కూల్ లో మంగళవారం స్కూల్ ఎలక్షన్స్ నిర్వహించారు. ఓటింగ్ పద్ధతి ద్వారా హెడ్ బాయ్, హెడ్ గర్ల్, స్కూల్ కెప్టెన్, కల్చరల్ ఇన్చార్జ్‌ని ఎన్నుకున్నారు. మూడవ తరగతి నుంచి పదవ తరగతి వరకు విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొని ఓటు వేశారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ కాంతి గంగారెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు యొక్క ప్రాధాన్యతను, ఓటుకి ఉన్న బలాన్ని, ఓటు వేసే వారికి ఉండే బాధ్యతని పిల్లలకు తొలినాళ్లలోనే పరిచయం చేసే విధంగా ఈ ఎన్నికలను నిర్వహించామని తెలిపారు. ఈ ఎన్నికల ద్వారా పాఠశాల బాధ్యులుగా పిల్లలను నియమించడంతో వారిలో నాయకత్వ లక్షణాలను పెంపొందించి వారికి క్రిటికల్ థింకింగ్ ప్రాబ్లం సాల్వింగ్‌లో నైపుణ్యాన్ని పెంపొందించుకునేలా ఈ కార్యక్రమం తోడ్పడుతుందని తెలిపారు. కార్యక్రమంలో పిల్లలందరూ పాల్గొని 100శాతం ఓటింగ్‌తో ఎన్నికలను విజయవంతం చేశారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బందం పాల్గొన్నారు.

డిజిటల్ క్లాస్ రూమ్ ప్రారంభం



రిబ్బన్ కట్ చేస్తున్న ఎస్‌బిఐ చీఫ్ జనరల్ మేనేజర్

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల, కళాశాలలో ఎస్బిఐ బ్యాంకు వారు రూపాయలు 5 లక్షలతో డిజిటల్ క్లాస్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. ఈక్లాస్‌రూంను ఎస్బిఐ బ్యాంకు చీఫ్ జనరల్ మేనేజర్ (హైదరాబాద్ సర్కిల్) రాజేష్ కుమార్, డిప్యూటీ జనరల్ మేనేజర్ బిజయ్ కుమార్ సాహూ , రీజినల్ మేనేజర్ మహేశ్వర్ కోలేటి, ఎస్బిఐ అర్గుల్ మేనేజర్ అరుణ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగ విచ్చేసిన సీజీఎం రాజేష్ కుమార్ మాట్లాడుతూ కాలానుగుణంగా భౌతిక తరగతి గదులను డిజిటలిజషన్ చేయడం అందులో ఎస్బిఐ బ్యాంక్ పాలుపంచుకోవడం సంతోషంగా ఉందని అన్నారు. విద్యార్థులు కాలం తో పోటీ పడి విజయం సాధించాలని తెలిపారు.

భారతదేశ అభివృద్ధి, భవిష్యతు చిన్నారుల అభివృద్ధిపై ఆధారపడి ఉంటుందని అన్నారు. చిన్నారుల అభివృద్ధికి ఎస్బిఐ ఎప్పుడు వారి వెన్నంటే ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రాజేష్ రెడ్డి, ఉపాధ్యాయులు, ఎస్బిఐ ఆఫీసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రాన్స్కో అధికారికి ఏడాది జైలు

- 10 వేల జరిమానా

నవతెలంగాణ-కంఠేశ్వర్

లంచం తీసుకున్న కేసులో ఏఏఈఎస్డీ సీఎల్ నిజామాబాద్‌కు ఒక సంవత్సరం కఠిన కారాగార శిక్ష, రూపాయలు 10వేలు జరిమానాను విధిస్తూ సెకండ్ అడిషనల్ స్పెషల్ జడ్జ్ ఏసిబి కోర్టు, నాంపల్లి, హైదరాబాద్ న్యాయమూర్తి మహమ్మద్ అఫ్రోజ్ అక్తర్ మంగళవారం తీర్పునిచ్చారు. 2008 జూలైలో మాక్లూర్ మండలం మదన్ పల్లి వ్యవసాయ క్షేత్రంలో విద్యుత్ కనెక్షన్ కోసం సుభాష్ గార్డెన్ యజమాని కేసరి శ్రీనివాస్ రెడ్డి ఏఏఈ మచ్చ సదాశివని సంప్రదించారు. కానీ సదరు అధికారి రూ. 5 వేల లంచం డిమాండ్ చేయడంతో శ్రీనివాస్ రెడ్డి ఏసీబీ అధికారులను కలిసి పిర్యాదు చేశారు. . దీనితో ఆయన నుంచి లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు 24 న రెడ్ హ్యాండ్‌గా పట్టుకున్నారు. నాంపల్లి ఏసీబీ కోర్టులో విచారణ జరిగింది. స్పెషల్ పీపీ లక్ష్మి మనోజ్ఞ ఏసీబీ పక్షాన వాదనలు వినిపించారు. నిందితుడి మీద అభియోగాలు రుజువు కావడంతో ఏఏఈ సదా శివ కు ఏడాది జైలు 10 వేల రూపాయల జరిమానా విధిస్తు న్యాయ మూర్తి మహ్మద్ అఫ్రోజ్ అక్తర్ తీర్పునిచ్చారు.జరిమానా చెల్లించని పక్షంలో మరో మూడు మాసాలు జైలు శిక్ష అనుభవించాలని ఆయన పేర్కొన్నారు.

ఫీల్డ్‌లో ఉన్న జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు అందించాలి

- కలెక్టర్‌కు వినతి

నవతెలంగాణ నిజామాబాద్ సిటీ

ఫీల్డ్ లో ఉన్న జర్నలిస్టులకు అక్రిడీ టేషన్ కార్డులు అందించాలని

సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో తెలంగాణ జర్నలిస్టు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్ కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు డిఎల్‌యన్. చారి మాట్లాడుతూ.. స్వేచ్ఛాయుత వాతావరణమే బలమైన ప్రజాస్వామ్యానికి నాంది అని అన్నారు. జర్నలిస్టుల ఆత్మగౌరవమైన అక్రిడిటేషన్ కార్డు జారీలో చాలా అవక తవకలు జరిగాయని అన్నారు. ఫీల్డ్ లో ఉండి వార్తలు రాసే ప్రతి ఒక్క జర్నలిస్టుకు అక్రిడిటేషన్ కార్డు అందించాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని అన్నారు. వెల్ నెస్ సెంటర్లలో మందుల కొరత తీవ్రంగా ఉందని, సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో, ప్రధాన కార్యదర్శి సితార్ల సురేష్, కోశాధికారి తమ్మల పాండు, నూతన్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

టీయూ ఎన్‌ఎస్‌యుఐ కమిటీ ఎన్నిక



ఎన్నికైన కమిటీని సన్మానించిన పలువురు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా భానోత్ సాగర్ నాయక్, ఉపాధ్యక్షులుగా ధర్పల్లి మహేష్ కుమార్, హరీష్, ప్రధాన కార్యదర్శిగా జనార్దన్, నవీన్, కార్యదర్శులుగా అలియాస్, బాలాజీ, కార్యవర్గ సభ్యులుగా అపర్ణ, రమ్య, మధు, గోవింద్, రాజేందర్, రాజ్ కుమార్, మహేందర్ తదితరులు ఎన్నికై య్యారు. ఈ సందర్భంగా సాగర్ నాయక్ మాట్లాడుతూ ఎన్ ఎస్ యుఐ పూర్వ అధ్యక్షుడు శ్రీశైలం యూనివర్సిటీకి ఎనలేని సేవలు అందించారని కొనియాడారు.. ఈ సందర్భంగా పూర్వ అధ్యక్షుడు కొమిర శ్రీశైలం మాట్లాడుతూ.. స్టూడెంట్ ఆర్గనైజేషన్ విద్యార్థుల ప్రగతికి, యూనివర్సిటీ అభివద్ధికి తోడ్పడిందని ఆయన వివరించారు.అనంతరం నూతన సభ్యులకు సన్మానం చేశారు.

కమ్మర్‌పల్లిలో కొవ్వొత్తుల ర్యాలీ



కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న పలువురు

నవతెలంగాణ కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలో మంగళవారం సాయంత్రం యువజన, ఛత్రపతి శివాజీ మహారాజ్ యువ సేన ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. వారం రోజులుగా బంగ్లాదేశ్ లోని హిందువుల పై జరుగుతున్న దాడులను, హత్యలను తీవ్రంగా ఖండించారు. అల్లర్లలో మతి చెందిన హిందువులకు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి నివాళులు అర్పించారు.

ఉపముఖ్యమంత్రికి స్వాగతం పలికిన నాయకులు

నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ బైపాస్ రోడ్డు వద్ద మంగళవారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్‌కు స్థానిక కాంగ్రెస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజలకు మెరుగైన పాలన అందిస్తున్నారని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర అభివద్ధికి కషి చేస్తున్నారని పేర్కొన్నారు.

రాంగ్ రూట్ డ్రైవింగ్‌పై అవగాహన

- నాలుగు బైకులు సీజ్ చేసిన ఎస్సై

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

వాహనదారులకు డ్రైవింగ్‌పైన అవగాహన కల్పిస్తూ ఆగస్టు 15 తర్వాత హెల్మెట్ లేకుండా నడిపిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని నిజామాబాద్ కమిషనర్ సూచించారని తెలిపారు. ద్విచక్ర వాహనంపై ప్రయాణించే సమయంలో హెల్మెట్ తప్పనిసరని అన్నారు.

రాంగ్ రూట్‌లో ప్రయాణించడం ప్రమాదకరం. కాగా మండల పరిధిలో బాలానగర్, జక్రాన్‌పల్లి, అర్గుల్ వద్ద రాంగ్ రూట్‌లో వస్తున్న వాహనాలదారులకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి, 4 బైక్ లను సీజ్ చేసినట్టు తెలిపారు.

ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డికి సన్మానం



నవతెలంగాణ-బోధన్

బోధన్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్‌గా నియమితులైన చీల శంకర్ దంపతులు మంగళవారం బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకుని శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఏఎంసీ వైస్ చైర్మెన్ చీల శంకర్ మాట్లాడుతూ.. ఏఎంసీ వైస్ చైర్మన్‌గా ప్రకటించిన సందర్భంగా మాజీ మంత్రి, బోధన్ శాసన సభ్యులు సుదర్శన్‌రెడ్డిని కృతజ్ఞత భావంతో సన్మానించినట్లు తెలిపారు. తన నియామకానికి కృషిచేసిన కాంగ్రెస్ పార్టీ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గంగోజి శంకర్, నరేందర్‌రెడ్డి, నాగేశ్వరరావు, గడ్డం శ్రీను, ప్రకాష్, అశోక్, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కస్తూర్బా విద్యాలయంలో అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని కస్తూర్బా విద్యాలయంలో పోలీస్ కళాబృందం కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఎల్లారెడ్డి స్థానిక ఎస్సై మహేష్ మంగళవారం తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా సైబర్ క్రైమ్, రోడ్డు భద్రత, బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, మానవ అక్రమ రవాణా నిర్మూలన, మత్తు పదార్థాల అనార్థాల గురించి విద్యార్థినీలకు క్లుప్తంగా వివరించామని, ఏదైనా అత్యవసర పరిస్థితులలో టోల్ ఫ్రీ నెంబర్ 100, 108, 1930, 181ను ఎలా ఉపయోగించుకోవాలో తెలియజేశామని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాబృందం సభ్యులు, షీటీం సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పార్కుల్లో ఆట వస్తువులను వినియోగంలోకి తీసుకురావాలి

- జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



పార్కును పరిశీలిస్తున్న కలెక్టర్

నవతెలంగాణ-కామారెడ్డి

పార్కుల్లో ఆట వస్తువులు వినియోగంలోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ మున్సిపల్ కమిషనర్ సుజాతను ఆదేశించారు. కామారెడ్డి పట్టణంలోని రాజీవ్ పార్కును మంగళవారం ఆయన సందర్శించారు. పార్కులో చెడిపోయిన ఆట వస్తువులను పరిశీలించారు. వాటి స్థానంలో కొత్తగా ఆట వస్తువులు ఏర్పాటు చేయాలని సూచించారు. నడక దారిలో ఉన్న పిచ్చి మొక్కలను తొలగించాలని తెలిపారు. మహిళా సంఘాల ఆధ్వర్యంలో పార్కులో క్యాంటీన్ ఏర్పాటు చేయాలన్నారు. మరుగుదొడ్లు శుభ్రంగా ఉంచాలని పేర్కొన్నారు. పార్కును అహ్లాదకర వాతావరణంగా మార్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ, అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

జాతీయ రహదారి పక్కన వ్యర్థ పదార్థాలు పడేసే వ్యక్తులకు జరిమానాలు విధించాలి..

జాతీయ రహదారి పక్కన చెత్త కుప్పలు పోసిన వారిని గుర్తించి జరిమానా విధించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ మున్సిపల్ కమిషనర్ సుజాతను ఆదేశించారు. కామారెడ్డి మండలం రామేశ్వర్ పల్లి శివారులో డంపింగ్ యార్డ్ ను మంగళవారం జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ సందర్శించారు. పట్టణంలోని చెత్తాచెదారాన్ని ఇక్కడికి తీసుకువచ్చి వేస్తారని మున్సిపల్ కమిషనర్ సుజాత కలెక్టర్ కు తెలిపారు. 16 ఎకరాల స్థలంలో డంపింగ్ యార్డ్ ఉందన్నారు. ఇక్కడ వేసిన చెత్తతో కంపోస్టు ఎరువులు తయారు చేస్తున్నామని పేర్కొన్నారు. 44 నెంబర్ జాతీయ రహదారి పక్కన ఫంక్షన్ హాల్స్ కు సంబంధించిన వ్యక్తులు వ్యర్థపదార్థాలను పడేయడం వల్ల దుర్వాసన వస్తుందని స్థానికులు తెలిపారు. వ్యర్థ పదార్థాలు జాతీయ రహదారి పక్కన పడేసే వారిని గుర్తించి జరిమానాలు విధించాలని కలెక్టర్ మున్సిపల్ అధికారులకు సూచించారు.

సీఎంఆర్ డెలివరీ వేగవంతం చేయాలి..

సిఎంఆర్ డెలివరీ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. కామారెడ్డి కలెక్టర్ కార్యాలయంలో సిఎంఆర్ డెలివరీపై సివిల్ సప్లై అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్లు రైస్ మిల్లును నిరంతరం పర్యవేక్షణ చేస్తూ డెలివరీ వేగవంతమయ్యే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. లక్ష్యానికి అనుగుణంగా డెలివరీ కాకపోతే రైస్‌మిల్ యజమానులపై చర్యలు తీసుకోవాలని కోరారు. సమీక్ష సమావేశంలో ఇంచార్జ్ జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి నిత్యానందం, ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్లు కిష్టయ్య, శ్రీనివాసరావు, అధికారులు పాల్గొన్నారు.

స్వాతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్..

కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఇందిరా గాంధీ స్టేడియంలో స్వాతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పరిశీలించారు. మైదానాన్ని పూర్తిస్థాయిలో శుభ్రం చేయాలని మున్సిపల్ కమిషనర్ సుజాతను ఆదేశించారు. జెండా ఏర్పాట్లు, మైదానం సిద్ధం చేయడం మొదలగు ఏర్పాట్లను పోలీస్, రెవెన్యూ శాఖ అధికారులు సమన్వయంతో పూర్తి చేయాలన్నారు. శకటాలు తిరిగే ప్రదేశమును, స్టాళ్ల ప్రదర్శన ఏర్పాటు చేసే స్థలాలను చూశారు. వేదిక, సభకు హాజరయ్యే వారు కూర్చోవడానికి సిట్టింగ్ ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలని సూచించారు. వాహనాల పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేయాలన్నారు. వేడుకలకు అన్ని శాఖల అధికారులు, సిబ్బంది, విద్యార్థులు తప్పనిసరిగా హాజరయ్యే విధంగా చూడాలన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత చేపట్టిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ రూపొందించాలన్నారు. స్వాతంత్ర దినోత్సవ వేడుకలకు అన్ని శాఖల అధికారులు, సిబ్బంది, విద్యార్థులు హాజరయ్యే విధంగా చూడాలన్నారు. విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు, సిబ్బందికి ప్రశంస పత్రాలు అందజేయడానికి ఆగస్టు 14 లోపు ప్రతిపాదనలు పంపాలన్నారు. విద్యుత్ అంతరాయం కలగకుండా విద్యుత్ అధికారులు చూసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ, ఆర్డీవో రంగనాథ్‌రావు, డి.ఎస్.పి నాగేశ్వరరావు, సీఐ చంద్రశేఖర్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అమరుల త్యాగఫలితం..
నేటి స్వాతంత్ర్య భారతం

- బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు విపుల్ జైన్



మాట్లాడుతున్న పలువురు

నవతెలంగాణ-కామారెడ్డి

హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర శాఖ పిలుపు మేరకు కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఆజాద్ హింద్ ఫౌజ్ వ్యవస్థాపకుడు, స్వాతంత్ర్య సమరయోధులు సుభాష్ చంద్రబోస్ విగ్రహం వద్ద స్వచ్ఛత కార్యక్రమం చేపట్టి ఆ మహనీయునికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు విపుల్ జైన్ మాట్లాడుతూ.. ఎంతో మంది అమరుల త్యాగ ఫలితం నేటి స్వాతంత్ర భారతమని అన్నారు. ప్రతి ఒక్కరూ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా వారిని స్మరించుకుని వారి త్యాగాలు తెలుసుకోవాలని, అలా అయితేనే ప్రజల్లో జాతీయ భావం పెరుగుతుందని అన్నారు. అందుకే నరేంద్ర మోడీ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆ మహనీయులను స్మరించుకోవాలని బీజేపీ ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా కార్యక్రమాలు చేపడుతున్నామని అన్నారు.

నర్సరీ పరిశీలన

నవతెలంగాణ-రెంజల్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో భాగంగా గత వారంలో స్వచ్ఛదనం కార్యక్రమాలు పూర్తి చేసినట్టు ఎంపీడీవో వెంకటేష్ జాదవ్ పేర్కొన్నారు. ఇక పచ్చదనంలో భాగంగా మండలానికి 70వేల మొక్కలను నాటడానికి ప్రణాళికలను సిద్ధం చేశామని, ప్రతి గ్రామానికి 4వేల మొక్కల చొప్పున 17 గ్రామ పంచాయతీల పరిధిలో మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. కార్యక్రమంలో ఉపాధి హామీ అధికారులు, సిబ్బందితోపాటు, గ్రామ కార్యదర్శులు మొక్కలు నాటే కార్యక్రమంలో చురుకుగా పాల్గొనాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమాన్ని మండలంలో విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ తమ సాయసహకారాలు అందించాలని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ శ్రీనివాస్, ఏపీఓ రమణ, గ్రామ కార్యదర్శి రాజేందర్‌రావు, ఈసీ శరత్ చంద్ర, సాంకేతిక నాయకులు రాజేశ్వర్, క్షేత్ర సహాయకులు శోభన్ తదితరులు పాల్గొన్నారు.

మరణాంతరం అవయవదానానికి ముందుకు వచ్చిన దంపతులు



దంపతులు శ్రీకాంత్, పావని

నవతెలంగాణ-సదాశివనగర్

కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలం అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామానికి చెందిన మోసార్ల శ్రీకాంత్, మోసార్ల పావని దంపతులు ప్రపంచ అవయవ దినోత్సవం సందర్భంగా ఆర్గాన్ డొనేషన్ రిజిస్ట్రేషన్‌కు ముందుకు వచ్చారు. తమ మరణానంతరం శరీరంలోని వివిధ అవయవాలు దానం చేయడం వల్ల కొందరి జీవితాల్లో వెలుగు చూడాలని రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు తెలిపారు. పుట్టిన ప్రతి వాడు చనిపోవడం తథ్యం. అన్ని జన్మలలో మానవ జన్మ ఎంతో గొప్పది. మనం బతికున్నప్పుడే కాదు.. చనిపోయిన తర్వాత కూడా పదిమందికి ఉపయోగపడవచ్చు. అందుకే తాము మరణాంతరం తమ అవయవాలను దానం చేసేందుకు రిజిస్ట్రేషన్ చేసినట్లు తెలిపారు. తాము మరణించిన మరొక్క వ్యక్తి రూపంలో తాము జీవిస్తూనే ఉంటామని.. ఒక జీవి ఆలోచనలో ఈ నిర్ణయానికి ముందుకు వచ్చామని తెలిపారు.

బిచ్కుంద డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా కొర్రి అశోక్

నవతెలంగాణ-బిచ్కుంద

రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ ఉత్తర్వులు మేరకు బిచ్కుంద డిగ్రీ కళాశాల రసాయన శాస్త్ర అధ్యాపకులు కొర్రి అశోక్‌ను ప్రిన్సిపాల్‌గా నియమించారు. గతంలో బిచ్కుంద డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా పనిచేసిన చంద్రముఖర్జీ బదిలీపై వెళ్లడంతో ప్రిన్సిపాల్‌గా కొర్రి అశోక్‌ను నియమించడంతోపాటు మద్నూర్ డిగ్రీ కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు అప్పజెప్పారు. ఈ సందర్భంగా కళాశాల సిబ్బంది పూలమాలలు శాలువాతో ప్రిన్సిపాల్‌ను సన్మానించి అభినందనలు తెలిపారు. ప్రిన్సిపాల్ కొర్రి అశోక్ మాట్లాడుతూ.. కళాశాల సిబ్బందితో పాటు అందరి సహాయ సహకారాలతో కళాశాలను అభివృద్ధి పథంలో నడిపిస్తానని, తనపై నమ్మకంతో కళాశాల ప్రిన్సిపాల్‌గా నియమించి బాధ్యతలు అప్పగించినందుకు ఉన్నత విద్యాశాఖ కమిషనర్, జే.డి, ఆర్జెడి, ఏజీవోలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు ఉన్నారు.

కళాశాలలో అధ్యాపకులను నియమించండి

మాజీ జెడ్పీటీసి మనోహర్ రెడ్డి

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

నాగిరెడ్డిపేట్ మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేయబడిన ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకులను నియమించాలని కోరుతూ మంగళవారం బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ డైరెక్టర్ శృతిజానును కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నూతనంగా ఏర్పాటు చేయబడిన కళాశాలలో 87 మంది విద్యార్థులు చేరారని, అధ్యాపకులు లేకపోవడంతో విద్యార్థులకు సరైన విద్యానందిచడం లేదని తెలిపారు. ఈ విషయంపై స్పందించిన ఇంటర్మీడియట్ డైరెక్టర్ శృతిజ వెంటనే అధ్యాపకులను నియమిస్తామని హామీనిచ్చారు.

ఎమ్మార్పీఎస్ దండోరాకు తరలివెళ్లిన మండల నాయకులు

నవతెలంగాణ-రామారెడ్డి

సికింద్రాబాద్‌లో తలపెట్టిన ఎమ్మార్పీఎస్ విజయ దండోరా ర్యాలీ మహోత్సవానికి మండల నాయకులు మంగళవారం తరలివెళ్లారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు యాదగిరి మాట్లాడుతూ.. ఎన్నో సంవత్సరాల పోరాట ఫలితమే ఎస్సీ వర్గీకరణ అని అన్నారు. తరలి వెళ్లిన వారిలో జిల్లా నాయకులు యాదగిరి, రాజనర్సు, బాణాపురం లావణ్య, ఎల్లన్న, సాయిలు, శైలేష్ తదితరులున్నారు.

మాజీ సర్పంచ్‌కు పరామర్శ



పరామర్శించిన మాజీ ప్రభుత్వ విప్

నవతెలంగాణ-దోమకొండ

మండల కేంద్రానికి చెందిన మాజీ సర్పంచ్ దీకొండ రామచంద్రం గత కొన్ని రోజులుగా ఆనారోగ్య సమస్యలతో బాధపడుతుండడంతో విషయం తెలుసుకుని మంగళవారం ఆయన నివాసం వద్ద మాజీ ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ ఆయన ఆరోగ్య పరిస్థితి వివరాలను తెలుసుకొని పరామర్శించారు. ఈ సందర్భంగా మాజీ ప్రభుత్వ విప్ గంపగోవర్ధన్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గం కార్యకర్తలకు కష్టకాలంలో అన్ని విధాలుగా తోడుగా ఉంటానని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి మాజీ ఎంపీపీ పిప్పిరి ఆంజనేయులు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కుంచాల శేఖర్, మాజీ ఎంపీటీసీ సభ్యులు కడారి రమేష్ కుమార్, మాజీ ఉపసర్పంచ్ గజవాడ శ్రీకాంత్,పార్టీ పట్టణ అధ్యక్షులు బోరెడ్డి కిషన్ రెడ్డి, పార్టీ మండల యూత్ అధ్యక్షులు పాలకుర్తి శేఖర్, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి బొమ్మెర శ్రీనివాస్ మాజీ వార్డ్ సభ్యులు ఐరేని లత నాయకులు కూర చంద్రం మన్నె సాయి రెడ్డి,చిట్యాల రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మద్దికుంటలో హర్‌ఘర్ తీరంగా

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని మద్దికుంటలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపు మేరకు మంగళవారం హర్‌ఘర్ తీరంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని స్వతంత్ర సమరయోధులు బిఆర్ అంబేద్కర్ అల్లూరి సీతారామరాజు, భగత్‌సింగ్ విగ్రహాలను శుద్ధి చేసి, పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు బూస నరేష్, ప్రధాన కార్యదర్శి పుట్టకొక్కుల నర్సింలు, నాయకులు గంగారం, రాజశేఖర్, సాయగౌడ్, ముత్యాల రాజు తదితరులు పాల్గొన్నారు.

బాల వికాస్ వాటర్ ప్లాంట్ కమిటీ ఎన్నిక

- అధ్యక్షులుగా మధుసూదన్ రెడ్డి

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని మోతె గ్రామంలో బాల వికాస్ వాటర్ ప్లాంట్ నూతన కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఎన్నికల నిర్వహించారు. బాల వికాస్ వాటర్ ప్లాంట్ కమిటీ అధ్యక్షులుగా మధుసూదన్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యదర్శిగా మేడి సాయిలు, సభ్యులుగా పాగల స్వామి, ధరావత రతన్, ఏలేటి సంజీవరెడ్డి, పందిరి రాములు, ధ్యాని లక్ష్మయ్యను ఎన్నుకున్నారు. వారిచేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు సాయగౌడ్, కార్యదర్శి రవీందర్‌రెడ్డి, గ్రామ పెద్దలు భూపతిరెడ్డి, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు రాకుండా
ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలి

- కుర్నాపల్లి మాజీ ఎంపీటీసీ సభ్యులు రాంరెడ్డి



వైద్య శిబిరంలో పాల్గొన్న పలువురు

నవతెలంగాణ-ఎడపల్లి

వర్షాకాలం ప్రారంభమైన దృష్ట్యా గ్రామీణ ప్రాంత ప్రజలు సీజనల్ వ్యాధులు రాకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కుర్నాపల్లి మాజీ ఎంపీటీసీ సభ్యులు రాంరెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని కుర్నాపల్లి గ్రామంలో ఎడపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీటీసీ, ఎంపీటీసీల ఫోరం ఎడపల్లి మండల మాజీ అధ్యక్షులు వెంకయ్య గారి రామ్‌రెడ్డి మాట్లాడారు. వర్షాకాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇంటి పరిసరాల పరిశుభ్రతతో పాటు ఇంటి ముందర చుట్టుపక్కల వర్షపు నీరు నిలవకుండా ఉండేందుకు గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికులతో పనులు చేయించాలన్నారు. చాలామందికి పరీక్షలు నిర్వహించి ఎడపల్లి ప్రభుత్వ ఆసుపత్రి వైద్య సిబ్బంది మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ రవీందర్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గాంధారి హనుమంత్ రెడ్డి, కొంద్ర సంజయ్, ప్రభుత్వ ఆసుపత్రి సూపర్వైజర్ నాగేందర్, జీవా, ఎంఎల్‌హెచ్‌పి శైలజ, శిరీష, స్టాఫ్‌నర్స్ లక్ష్మి, ఏఎన్ఎం శాంతా, ఆశావర్కర్లు విజయ, అనిత, కుర్నాపల్లి గ్రామ ఆశావర్కర్లు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

వేడివేడి ఆహారాన్ని అందించాలి

- డీఈవో దుర్గాప్రసాద్
- రెంజల్ కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల తనిఖీ



రికార్డును పరిశీలిస్తున్న డీఈవో

నవతెలంగాణ-రెంజల్

విద్యార్థులకు వేడివేడి ఆహారాన్ని అందించాలని డీఈవో దుర్గాప్రసాద్ భోజన నిర్వాహకులను ఆదేశించారు. మంగళవారం మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలల్లోని విద్యార్థుల వివరాలు, వారికి అందిస్తున్న పౌష్టికాహారం గురించి పిల్లలను అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆయన సూచించారు. బాలికలకు వేడి వేడి ఆహారాన్ని అందించేలా చర్యలు తీసుకోవాలని నిర్వాహకురాలు శ్యామలను ఆదేశించారు. విద్యా బోధన పట్ల ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేస్తూ, నాణ్యమైన విద్య బోధనను అందించాలని ఆయన అన్నారు. వారం రోజులకోసారి విద్యార్థులకు వైద్య పరీక్షలను చేయించాలని ఆయన సూచించారు. ఆయన వెంట నిర్వాహకురాలు శ్యామల, ఉపాధ్యాయ బృందం, సిబ్బంది తదితరులున్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

- బెల్యానాయక్ తండాలో ఎంపీవో పర్యటన



పరిశీలిస్తున్న పలువురు

నవతెలంగాణ-వర్ని

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీవో మారుతి, హెల్త్ డిపార్ట్మెంట్ కృష్ణవేణి అన్నారు. మండలంలోని మల్లారం గ్రామ పరిధిలో గల బెల్యా నాయక్ తండాలో మంగళవారం వారు పర్యటించారు. ఈ సందర్భంగా తండా వాసులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఇంటి చుట్టూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. తడి పొడి చెత్తను ఎప్పటికప్పుడు పంచాయతీ ట్రాక్టర్‌లో తరలించాలన్నారు. నీటి తొట్టిలలో ఎక్కువ రోజుల నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, లేనియెడల దోమలకు నివాసంగా మారుతాయని తెలిపారు. దోమల వల్లన డెంగ్యూ, మలేరియా, విష జ్వరాలు వస్తాయని తెలిపారు. ఆశావర్కర్లు గ్రామాలలో విష జ్వరాలతో ఉండేవారిని గుర్తించి సకాలంలో వైద్యం అందేలా చూడాలన్నారు. గ్రామంలో శానిటేషన్ పనులు ఎప్పటికప్పుడు చేయాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ జ్యోతి, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

వయోవృద్ధుల శిబిరం

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి



మండలంలోని కేశ్‌పల్లి, పడకల్‌లో వృద్ధుల వైద్య శిబిరాలు మంగళవారం నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని జిల్లా ఆయుష్మ వైద్య అధికారి నారాయణ ప్రారంభించారు. వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల ఆయుష్మ శాఖ వైద్యాధికారి లలిత, ఫార్మసిస్టులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

7వ బెటాలియన్‌లో వనమహోత్సవం

నవతెలంగాణ-డిచ్‌పల్లి



మండల కేంద్రంలోని తెలంగాణ ప్రత్యేక పోలీస్ 7వ బెటాలియన్ కమాండెంట్ పి. రోహిణి ప్రియదర్శిని ఐపియస్ అద్వర్యంలో మంగళవారం వనమహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కమాండెంట్, బెటాలియన్ సిబ్బంది బెటాలియన్ అవరణంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పిల్లలతో కలసి మొక్కలను నాటారు.ఈ కార్యక్రమం లో అసిస్టెంట్ కమాండెంట్స్ కె.పి శరత్ కుమార్, కె.పి సత్యనారయణ, అర్.ఐలు పి. వేంకటేశ్వర్లు, బి. శ్యాంరావు, అర్. ప్రహల్లాద్, బి. వసంత్ రావు, అర్.యస్.ఐలు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి డేటాను కంప్యూటర్‌లో నిక్షిప్తం చేయాలి

- జిల్లా ఇంటర్ విద్య అధికారి రవికుమార్
- ఇంటర్ అకాడమిక్, అడ్మిషన్లపై సమీక్ష

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

20వ తేదీ లోగా ప్రతి విద్యార్థి డేటాను కంప్యూటర్లలో నిక్షిప్తం చేయడంతోపాటు విద్యార్థుల ఫోటో, సంతకాలను కూడా ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేయాలని జిల్లా ఇంటర్ విద్య అధికారి రవికుమార్ ఆదేశించారు. నిజామాబాద్ జిల్లా ఇంటర్ విద్య కార్యాలయంలో మంగళవారం ప్రభుత్వ కళాశాలల ప్రిన్సిపాళ్ల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా ఇంటర్ విద్య అధికారి తిరుమలపూడి రవికుమార్ 2024-25 విద్యా సంవత్సరానికి గాను అకాడమిక్, అడ్మిషన్ల విషయమై సమీక్ష నిర్వహించారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్లను ఈ నెల 20 వరకు తీసుకోవచ్చని తెలిపారు. పదవ తరగతి ఉత్తీర్ణులైన పేద, బడుగు, మైనారిటీ, బలహీనవర్గాలకు చెందిన విద్యార్థులను కళాశాలలో చేర్పించేందుకు క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ చేయాలన్నారు. అలాగే ఉచిత పాఠ్య పుస్తకాల పంపిణీ పూర్తి చేయాలని, అవసరమైతే మరిన్ని పాఠ్యపుస్తకాలను ఇంటర్ బోర్డు నుండి తెప్పించడానికి కృషి చేస్తామని తెలిపారు. కళాశాలలలో పచ్చదనం, పరిశుభ్రత, మొక్కలు నాటడం వాటిని పరిరక్షించడంపై ప్రిన్సిపాళ్లు దృష్టి సారించాలని ఆదేశించారు. కళాశాలలో విద్యార్థులకు ర్యాగింగ్ నిరోధక చట్టం గురించి అవగాహన కల్పించాలని అన్నారు. ఏ కళాశాలలో ర్యాగింగ్ జరగకూడదని ఆదేశించారు. విద్యార్థులు చదువుపై దృష్టి సారించేలా ప్రిన్సిపాళ్లు కృషి చేయాలని ఆదేశించారు. అలాగే మత్తు పదార్థాలు, డ్రగ్స్, సెల్‌ఫోన్ల వాడకం నిషేధించాలని వాటిపై తదితర సామాజిక మాధ్యమాలపై కూడా విద్యార్థులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఇందుకోసం కళాశాల కమిటీలను ఏర్పాటు చేసి విద్యార్థులకు మత్తు పదార్థాల వాడకం నిషేధం, ర్యాగింగ్ నిషేధంపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని ఆదేశించారు. ప్రతి కళాశాలలో ఈ అంశాలపై ఎప్పటికప్పుడు సమీక్షించాలని జిల్లా ఇంటర్ విద్యా అధికారి ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లను ఆదేశించారు. ప్రతి కళాశాలలో మొక్కలు నాటడంతోపాటు వాటి పరిరక్షణపై దృష్టి సారించాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ఇంటర్ విద్యాధికారి రవికుమార్

బంద్ విజయవంతం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

బంగ్లాదేశ్‌లో గత వారం రోజులుగా హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా చత్రపతి శివాజీ మహారాజ్ యువసేన ఆధ్వర్యంలో నిర్వహించిన మండల బంద్ విజయవంతం అయ్యింది. మంగళవారం మండలంలోని అన్ని గ్రామాల్లో ఉదయం నుంచి వ్యాపార, వాణిజ్య, సముదాయాలను మూసి ఉంచారు. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు కూడా బంద్‌కు మద్దతుగా తమ పాఠశాలలకు సెలవులు ప్రకటించాయి. సభ్యులు మాట్లాడుతూ.. గత వారం రోజులుగా బంగ్లాదేశ్‌లో జరుగుతున్న అల్లర్లలో అమాయక హిందూ యువకులను, మహిళలను, పసి పిల్లలను, వృద్ధులను చంపుతున్న బంగ్లాదేశ్ నరరూప రాక్షసుల చర్యలను ఖండిస్తున్నామన్నారు. హిందువుల ఆస్తులను దోచుకుంటూ, తగలబెడుతూ హిందువుల మందిరాలను కూలగొడుతున్న అరాచక శక్తులపై బంగ్లాదేశ్ ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. బందు పిలుపునకు స్పందించి సహకరించిన మండల ప్రజలందరికీ ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు.

మోపాల్‌లో తిరంగా ర్యాలీ



జెండాలతో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు, కార్యకర్తలు

నవతెలంగాణ-మోపాల్

హర్ ఘర్ తిరంగా అభియాన్‌లో భాగంగా మండలంలో బీజేవైఎం ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీని ఘనంగా మంగళవారం నిర్వహించారు. భవిష్యత్తు తరాలకు స్ఫూర్తిని కలిగించే విధంగా ఈ ర్యాలీలో మోపాల్ మండల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో హర్ ఘర్ తిరంగా జిల్లా సహ ఇంచార్జ్ సందీప్ కుమార్, బిజెవైఎం జిల్లా అధ్యక్షులు రాజశేఖర్, యువ మోర్చా రూరల్ అసెంబ్లీ కన్వీనర్ శ్రీకాంత్, మోపాల్ మండల అధ్యక్షులు రవి, సీనియర్ నాయకులు నవీన్‌రెడ్డి, యాదాల నరేష్, కిసాన్ మోర్చా మండల అధ్యక్షులు గంగాధర్, ఎస్టి మోర్చా మండల అధ్యక్షులు రమేష్, కృష్ణ, దేవనాయక్, దత్తు గౌడ్, సోషల్ మీడియా కన్వీనర్ మధు, నరేష్, పార్టీ కార్యకర్తలు, పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

నవతెలంగాణ-బాల్కొండ



రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలైన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో మంగళవారం చోటు చేసుకుంది. బాల్కొండ ఏఎస్ఐ శంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన సిరి కంటి మహేష్ ఈనెల 9న ఇండియన్ పెట్రోల్ బంక్‌లో పనిచేయుటకు వెళుతుండగా మహేష్ నడుపుతున్న బైకును మార్గమధ్యలో రాంగ్ రూట్లో వస్తున్న ఆటో ఢీ కొట్టింది. ఆటో డ్రైవర్ షేక్ రహీం అతివేగంగా అజాగ్రత్తగా నడిపి ఢీకొట్టడంతో మహేష్ తలకు, శరీరంపై పలుచోట్ల గాయాలు కాగా జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ హాస్పిటల్లో చికిత్స పొందాడు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తీసుకువెళ్తుండగా మార్గమధ్యలో చనిపోయాడని పేర్కొన్నారు. మృతుని భార్య సిరి కంటి భాగ్యలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్ఐ శంకర్ తెలిపారు.

ఐక్యంగా ఉన్నప్పుడే సమస్యలు పరిష్కరించుకోగలుగుతాం



ఎన్నికైన నాయి సంఘం సభ్యులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

అందరం ఐక్యంగా ఉన్నప్పుడే సమస్యలను పరిష్కరించుకోగల్గుతామని నాయిసంఘం సభ్యులు అన్నారు. మంగళవారం గౌతమ్ నగర్ తర్ప నాయి సంఘం ఎన్నికలను నిర్వహించారు. తర్ప పరిధిలోని వారందరూ సమావేశం అయి ఎలక్షన్స్ నిర్వహించారు. అధ్యక్షులుగా నిమల లింబాద్రి, ప్రధాన కార్యదర్శిగా పసుపునూరి రాములు, కోశాధికారిగా పసుపునూరి బాలరాజును ఎన్నుకున్నారు. నాయి బ్రాహ్మణ కుల బాంధవుల అభ్యున్నతికి కృషి చేస్తామని తెలిపారు.

పాఠశాలలో శ్రీ సరస్వతి, వినాయకుని విగ్రహ ప్రతిష్ట

నవతెలంగాణ-మాక్లూర్



విగ్రహ ప్రతిష్టలో పాల్గొన్న గ్రామ పెద్దలు

ఆలూరు మండలంలోని కల్లడి గ్రామంలో గ్రామ పెద్దలు, యువకుల ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలో శ్రీ మాత్రే సరస్వతి మాత, శ్రీ బొజ్జ గణపయ్య విగ్రహాలను పాఠశాల ఆవరణలో మంగళవారం ప్రతిష్టాపన చేశారు. ఈ విగ్రహ దాతలు పుంజు మనీష్ గౌడ్, బోడిగం నాగేష్ పూజ కార్యక్రమలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నాగరాజ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఎస్ఎంసి చైర్మన్ కర్ణం ప్రకాష్ రావ్, గ్రామ పెద్ద మనుషులు ప్రళయ్ తేజ్, సుధాకర్, బండారి రమేష్, కృష్ణ, మల్లారెడ్డి, మల్లేష్, రాజు, అర్షిత్, నరేందర్, నరసయ్య గ్రామ యువకులు, ప్రజా ప్రతినిధులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలపై ఫిర్యాదు చేయాలి

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని పడకల్ గ్రామంలో ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ డిచ్‌పల్లి ఆపరేషన్ డివిజన్ పరిధిలోని పరకాల గ్రామంలో విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక మంగళవారం నిర్వహించినట్టు పడకల్ సబ్‌స్టేషన్ అధికారి భాస్కర్ తెలిపారు. దీనికి చీఫ్ ఇంజనీర్ రామకృష్ణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారని అన్నారు. ఎటువంటి ఫిర్యాదులు రాలేదని తెలిపారు ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ విద్యుత్తు వినియోగదారులు తమ సమస్యలను ప్రతి సోమవారం నిర్వహించే సబ్‌స్టేషన్ విద్యుత్ ప్రజావాణిలో ఫిర్యాదు చేయవచ్చన్నారు. ప్రతి వినియోగదారుడు కెపాసిటర్లు బిగించుకొని నాణ్యమైన కంపెనీ విద్యుత్ మోటర్లు వాడాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా విద్యుత్ అధికారులు కిషన్; రాజా గౌడ్, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అధికారి భాస్కర్

ఎస్ఎంహెచ్ హాస్టల్స్‌లో ర్యాగింగ్‌ను అరికట్టాలి

- పీడీఎస్‌యూ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నగరంలో ఉన్న కొన్ని హాస్టల్స్‌లో ర్యాగింగ్ ను అరికట్టాలని పిడిఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ జిల్లా సంక్షేమ హాస్టల్స్ అధికారులను కోరారు. ఈ సందర్భంగా నిజామాబాద్ నగరంలో పిడిఎస్‌యూ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేశ్వర్ మాట్లాడుతూ.. నిజామాబాద్ నగరంలో ఉన్న కొన్ని పోస్ట్ మెట్రిక్ స్టూడెంట్ మేనేజ్మెంట్ హాస్టల్స్ (ఎస్ ఎంహెచ్)లో సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులను పరిచయం, హాబిట్స్ ప్రదర్శన పేరుతో వికృత చేష్టలు చేస్తున్నట్టు మా దృష్టికి వచ్చిందని అన్నారు. దీనిని సరి చేయాల్సిన బాధ్యత సంబంధిత హాస్టల్ వార్డెన్స్‌పైన ఉందని తెలిపారు. హాస్టల్స్‌లో జరిగే వికృత చేష్టలను మార్చకపోతే పైఅధికారులకు ఫిర్యాదు చేయవలసి వస్తుందని తెలిపారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులను ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూసుకోవాలని అన్నారు. గర్ల్స్ హాస్టల్స్ వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, నాణ్యమైన భోజనం మెనూ ప్రకారం అందించాలని, మౌలిక సదుపాయాలు వర్షాకాలంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఏదైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో పిడిఎస్‌యూ నాయకులు దేవిక, లహరి, అక్షయ్, రాకేష్, బిందు, రాజు పాల్గొన్నారు.

రేపట్నినుంచి హెల్మెట్ తప్పనిసరి

- నగరంలో ట్రాఫిక్ పోలీసుల తనిఖీలు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో మంగళవారం నిజామాబాద్ ట్రాఫిక్ సిఐ వెంకటరమణ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సిఐ వెంకటరమణ మాట్లాడుతూ.. నిజామాబాద్ ప్రజలు ఈనెల 15 నుండి తూచా తప్పకుండా నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ ఆదేశాల మేరకు ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలన్న నిబంధనను పాటించాలన్నారు. పాటించని వాహనదారులకు చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈనెల 15 నుండి హెల్మెట్ ధారణ తప్పనిసరి కావున ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తనిఖీలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ట్రాఫిక్ నియమ నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలని, లేకుంటే జరిమానాతో పాటు కేసులు చర్యలు తప్పవన్నారు. హెల్మెట్ ధరించని వాహనదారులకు హెల్మెట్ వాడాలని అన్నారు. హెల్మెట్ ధరించకపోతే జరిగే పరిణామాల గురించి క్లుప్తంగా వివరించారు.



వాహనాలను తనిఖీచేస్తున్న ట్రాఫిక్ పోలీసులు

హైదరాబాద్‌కు తరలిన ఎమ్మార్పీఎస్ నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

30 సంవత్సరాల సుదీర్ఘ పోరాటం ఎస్సీ వర్గీకరణ సాధించి ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు వస్తున్న మందకృష్ణ మాదిగకు స్వాగతం పలకడానికి నిజామాబాద్ జిల్లా ఎమ్మార్పీఎస్, మాదిగ ఉద్యోగులు మంగళవారం హైదరాబాద్‌కు తరలివెళ్లారు. ఈసందర్భంగా బైపాస్ రోడ్‌లో సంఘీభావం ప్రకటించి స్లోగన్స్ ఇచ్చారు. అనంతరం హైదరాబాద్‌లో జరిగే భారీ విజయోత్సవ ర్యాలీ, సమావేశానికి తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్ఆర్‌పిఎస్, ఎంఈఎఫ్ నాయకులు మాట్లాడుతూ.. ప్రపంచంలో ఎక్కడా లేని ఉద్యమ పోరాటం కేవలం మాదిగ జాతికే చెల్లిందని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్ఎస్‌పి జిల్లా అధ్యక్షులు సరికేల పోశెట్టి, మాదిగ ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు కనక ప్రమోద్ మాదిగ, మాదిగ ఉద్యోగుల రాష్ట్ర నాయకులు సిలుమల సురేష్, తెడ్డు గంగారాం, జిల్లా నాయకులు కూడల ప్రవీణ్, మారుతీ, సూరజ్, ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగం. రాజేష్, జిల్లా ఉపాధ్యక్షులు రొడ్డ ప్రవీణ్ ఎంఎస్‌పీ జిల్లా నాయకులు మంద ప్రభాకర్ మాదిగ, విహెచ్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు కె.బీరప్ప, ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యకులు ఆకారం రమేష్, నిజామాబాద్ అర్బన్ అధ్యక్షులు పెద్దిగారి మహేష్ మాదిగ, జిల్లా కార్యదర్శి ప్రదీప్, రాంచంద్రం, శేఖర్, సాయిలు, మహేష్, బాలు, సాయి, రమేష్, తదితరులు పాల్గొన్నారు.



హైదరాబాద్ తరలుతున్న నాయకులు

మున్సిపల్ ఔట్ సోర్సింగ్ కార్మికుల వేతన సమస్యను పరిష్కరించాలి

- నేడు లేబర్ కమిషనర్‌తో సమావేశం

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఈ నెల 14న లేబర్ కమిషనర్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌తో బహుజన మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయ్ యూనియన్ (బిఎల్‌టీయూ) మధ్య జాయింట్ సమావేశాన్ని ఏర్పాటు చేశారని బహుజన మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయ్ యూనియన్ బిఎల్‌టీయూ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు దండి వెంకట్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ కార్పొరేషన్‌లో విధులు నిర్వహిస్తున్న వాటర్ సప్లయ్, స్ట్రీట్ లైట్స్, గార్డెన్స్, ఫిల్టర్ బెడ్స్ ఔట్ సోర్సింగ్ కార్మికులకు జీవో నెంబర్ 60 ప్రకారం కనీస వేతనం రూ.19,500 అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆగస్టు 14న లేబర్ కమిషనర్‌తో జరిగే సమావేశం అనంతరం భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తామని చెప్పారు.

వైద్య ఖర్చుల కోసం ఎల్‌ఓసి అందజేత

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని ఉప్లూర్ గ్రామానికి చెందిన గంగాధర్ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయాలయ్యాయి. మెరుగైన చికిత్స కోసం నిమ్స్ హాస్పటల్‌కు తరలించారు. అతని వైద్య ఖర్చుల కోసం బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్‌ను సంప్రదించారు. స్పందించిన ఆయన ముఖ్యమంత్రి సహాయం నిధి నుంచి రూ.75వేల ఎల్‌ఓసిని మంజూరు చేయించారు. ఆ ఎల్‌ఓసి మంజూరు పత్రాన్ని మంగళవారం బాధితుడు గంగాధర్‌కు అందజేశారు.

కుటుంబానికి చేయూత



చేయూతనందిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-మాక్లూర్

ఆలూరు గ్రామానికి చెందిన నిరుపేద వంజరి కుల సోదరుడు నగేష్, అమ్మ లక్ష్మి ప్రతి రోజు బిక్షటన చేస్తూ గ్రామం లోని హనుమాన్ ఆలయంలో ఉంటోంది. ఈ విషయం నిజామాబాదు వంజరి ట్రస్ట్ సభ్యులకు సమాచారం రాగ వెంటనే ఆలూరు గ్రామానికి ట్రస్ట్ అధ్యక్షులు మాస్టర్ శంకర్, ప్రధాన కార్యదర్శి పోతనకర్ లక్ష్మి నారాయణ ట్రస్ట్ సభ్యులు వెళ్లి వారితో మాట్లాడారు. ఈ సందర్భంగా మాస్టర్ శంకర్, పోతనకర్ లక్ష్మి నారాయణ, మాట్లాడుతూ నగేష్ కుటుంబ సభ్యులకు అండగ ఉంటామని అన్నారు. తక్షణ సహాయంగా కొన్ని రోజులకు సరిపడే నిత్యావసర సరుకులు, బట్టలు అందజేశారు. వారికి ఉండాటనికి నివాస షెడ్డు తొందర్లోనే ఏర్పాటు చేయిస్తామని హామీ ఇచ్చారు. రాబోయే రోజుల్లో ట్రస్ట్ ద్వారా సేవ కార్యక్రమాలు విస్తరిస్తామని వారన్నారు. పేద వంజరి లకు డబుల్ బెడ్ రూమ్‌లో అవకాశం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా ఆలూరు గ్రామ సభ్యులు వంజరి ట్రస్ట్ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో జిల్లా వంజరి సంఘం అధ్యక్షులు బోనేకర్ భూమయ్య, ట్రస్ట్ సభ్యులు కరిపే రవీందర్, కాపుకర్ ఆలూరు భూమేష్, నవతే గంగాధర్ ఉప సర్పంచ్ పోతనకర్ శ్రీనివాస్, గోపాల్ శ్రీధర్, కరిపే మధు సుదన్, దత్రిక రాజేందర్, అమందు విజయ్ కృష్ణ, సురేష్,కార్యవర్గ సభ్యులు, ఆలూరు వంజరి సంఘ సభ్యులు పాల్గొన్నారు

జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని సికింద్రాపూర్ జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం జరిగి ఒక మృతి చెందినట్లు ఎస్సై తిరుపతి మంగళవారం తెలిపారు.సోమవారం రాత్రి 10:30 కు పడకల్ తండాకు చెందిన బాదావత్ సంతోష్(30) తన బైకుపై సుద్దపల్లి కి వెళ్తున్నాడు. సికింద్రాపూర్ వద్ద జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీకి వెనుక నుంచి ఢీ కొట్టడంతో తలకు గాయమై అక్కడికక్కడే చనిపోయాడు. ఈ ఘటనపై మృతుడి తండ్రి దత్తాద్రి ఇచ్చిన ఫిర్యాదుపై ఎస్సై కేసు నమోదు చేసి పంచనామా నిర్వహించారు.

బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులకు నిరసనగా దిష్టిబొమ్మ దహనం

నవతెలంగాణ-ఏర్గట్ల

బంగ్లాదేశ్ లో హిందువులపై దాడులకు నిరసనగా మండలకేంద్రంలోని అమర వీరుల స్థూపం వద్ద బీజేపీ మండల పార్టీ ఆధ్వర్యంలో బంగ్లాదేశ్ ముస్లింల దిష్టిబొమ్మను మంగళవారం దహనం చేశారు. భవిష్యత్‌లో హిందువులపై దాడులు చేస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు.ఆగస్టు 14 బుధవారం రోజున ఏర్గట్ల బంద్ కు పిలుపునిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పార్టీ మండలాధ్యక్షులు నారాయణ రెడ్డి,కార్యకర్తలు అయోధ్య నర్సయ్య,ప్రశాంత్,గుండ విఠల్, గంగేష్,ఘన శ్యామ్,భూమేష్,తదితరులు పాల్గొన్నారు.

గర్భిణీలు పౌష్టికాహారాన్ని తీసుకోవాలి

- రామారెడ్డి పీహెచ్‌సీ వైద్యులు సురేష్

నవతెలంగాణ-రామారెడ్డి



అవగాహన కల్పిస్తున్న వైద్యులు సురేష్

పుట్టబోయే బిడ్డ, తల్లి ఆరోగ్యంగా ఉండాలంటే గర్భిణీలు తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని రామారెడ్డి పిహెచ్సి వైద్యులు సురేష్ సూచించారు. మంగళవారం ఆస్పత్రిలో 30 మంది గర్భిణీలకు పరీక్షలు నిర్వహించారు. అవసరమైన మందులు అందజేసి తగు జాగ్రత్తలను సూచించారు. గర్భిణులకు ఎలాంటి సమస్య ఉన్నా వెంటనే వైద్యులకు, వైద్య సిబ్బందికి తెలియజేయాలని సూచించారు. వైద్య సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించి, సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు చైతన్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మూగ జీవాలకు సేవలందించడం అదృష్టం

- ఎడపల్లి పశువైద్యాధికారి ప్రమోద్ కుమార్

నవతెలంగాణ-ఎడపల్లి



మూగజీవాలకు సేవలందించడం అదృష్టంగా భావిస్తున్నట్టు ఎడపల్లి పశువైద్యాధికారి కుమార్ అన్నారు. గేదెలు, మేకలు, గొర్రెలకు గాలికుంటు వ్యాధి సోకితే టీకాలు ఇస్తూ, పాడి పశువులు కలిగి ఉన్న రైతన్నలకు ఉచితంగా మందులను పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. సెప్టెంబర్ మాసంలో గాలికుంటు వ్యాధి కార్యక్రమాలను ప్రభుత్వం నిర్వహిస్తున్నందున పాడి గేదెలు పశువులు, గొర్రెలు మేకలు ఉన్న యజమానులు తప్పకుండా టీకాలను వేయించాలన్నారు. పశువులు ఆరోగ్యంగా ఉన్నప్పుడే పచ్చిమేత ఎండు గడ్డి తినే అవకాశం ఉంటుందన్నారు. అలాగే మేకలు, గొర్రెల యజమానులు కాపరులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తెలిపారు. అత్యవసర సమయంలో ఆస్పత్రికి యజమానులు వస్తే కావలసిన మందులను మార్చి పంపిణీ చేస్తామన్నారు.

అమ్మ జన్మనిస్తుంది.. అవయవదానం పునర్జన్మనిస్తుంది..

- భిక్కనూర్ సిఐ సంపత్ కుమార్
- అవయవదాన దినోత్సవం సందర్భంగా అవగాహన

నవతెలంగాణ-భిక్కనూర్



అవయవదానం చేసిన కుటుంబ సభ్యులను సన్మానిస్తున్న దృశ్యం

మనిషి మరణించినా మరికొందరి ప్రాణాలను కాపాడే గొప్ప అవకాశం అవయవదానం వల్ల కలుగుతుందని భిక్కనూర్ సిఐ సంపత్ కుమార్ తెలిపారు. బుధవారం అంతర్జాతీయ అవయవదాన దినోత్సవం సందర్భంగా పట్టణంలోని విజ్ఞాన్ పాఠశాలలో అవగాహనా సదస్సును నిర్వహించారు. సిద్ధిరామేశ్వర ట్రస్ట్, ఎన్‌హెచ్ఆర్‌సి కామారెడ్డి, విజ్ఞాన్ హైస్కూల్ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో సిఐ మాట్లాడుతూ నేటి సమాజంలో అవయవదానంపై మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని, దేశంలో వివిధ కారణాలతో అవయవాలు చెడిపోయి అనేకమంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ప్రతి ఒక్కరూ అవయవ దానం చేసి వారి ప్రాణాలను కాపాడే బాధ్యత తీసుకోవాలని, రక్తదానం వలె అవయవదానం కూడా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. జీవన్ దాన్ తెలంగాణ సంస్థ ప్రతినిధి మాలోత్ మహిపాల్ మాట్లాడుతూ అవయవ దానం చేసేవారు, అవయవాలు అవసరం ఉన్నవారు తమ సంస్థ ద్వారా రిజిస్టర్ చేసుకొని ప్రాణాలు కాపాడుకోవచ్చని సూచించారు. ఇటీవల చిన్న వయసులో సైతం కిడ్నీలు చెడిపోయి అనేకమంది బాధపడుతున్నారని అలాంటి వారి కోసం అవయవదానంతో తమ వంతు సహాయ సహకారాలు అందించాలని తెలిపారు.

ఈమధ్య కాలంలో బ్రెయిన్ డెడ్ అయి అవయవ దానం చేసిన దోమకొండకు చెందిన నిఖిల్, పెద్ద మల్లారెడ్డి గ్రామానికి చెందిన ప్రవీణ్, కామారెడ్డికి పట్టణానికి చెందిన మాధురి లక్ష్మి కుటుంబ సభ్యులను సన్మానించారు. వారు తీసుకున్న నిర్ణయం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ వారి త్యాగాన్ని గుర్తించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ ఎల్లయ్య, ఎస్సై సాయికుమార్, దోమకొండ ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, విజ్ఞాన్ పాఠశాల కరెస్పాండెంట్ విజయభాస్కర్ రెడ్డి, ఆర్‌బిఎస్‌కే మెడికల్ ఆఫీసర్ మనోజ్, సిద్ధి రామేశ్వర ట్రస్టు, ఎన్‌హెచ్ఆర్‌సి కామారెడ్డి కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బ్యాంకు లింకేజీ ద్వారా కొనుగోలు చేసిన గేదెలు పరిశీలన



గడ్డిని పరిశీలిస్తున్న అధికారులు

నవతెలంగాణ-బిచ్కుంద

మహిళా శక్తి బ్యాంకు లింకేజీ ద్వారా కొనుగోలు చేసిన గేదెలు రైతులు పండిస్తున్న ఆస్ట్రేలియన్ గడ్డిని డిఆర్డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ సురేందర్ పరిశీలించారు. ముందుగా ఇందిరా క్రాంతి పథకం కార్యాలయంలో సీసీలతో సమావేశం నిర్వహించి ఆదాయ, అభివద్ధి తదితర విషయాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం మండల కేంద్రంలో, గోపన్‌పల్లి గ్రామంలో మహిళా సమైక్య సంఘం సభ్యులకు అందజేసిన 10 లక్షల రుణాల ద్వారా కొనుగోలు చేసిన గేదెలను వాటికి అందిస్తున్న ఆస్ట్రేలియన్ గడ్డిని పరిశీలించి మహిళా సభ్యులతో మాట్లాడారు. మహిళా శక్తి ద్వారా గేదెలు కొనుగోలు చేయడానికి రుణాలు ఇవ్వనున్నట్టు తెలిపారు. ఈ రుణాలను సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఆయన వెంట డిపిఎం సుధాకర్, ఏపిఎం నాగరాజు, సీసీలు నర్సింహులు, మహిళా సమైక్య సభ్యులు ఉన్నారు.

పుస్తకాలు పంపిణీ



పంపిణీ చేసిన పుస్తకాలతో విద్యార్థులు

నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలోని వడ్డేపల్లి గ్రామంలో గల ప్రాథమిక పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆఫ్ ఎడపల్లి ఆధ్వర్యంలో సుమారు 30 మంది విద్యార్థులకు రాత పుస్తకాలను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ ఎడపల్లి అధ్యక్షులు మాట్లాడుతూ.. లయన్స్ క్లబ్ అనేది ఒక స్వచ్ఛంద సేవ సంస్థ అన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి రాకేష్ వర్మ, కోశాధికారి గంగారెడ్డి, జిల్లా కోఆర్డినేటర్‌లు కరటూరి సూర్యనారాయణ, మెర్సీ, కదం ప్రకాష్‌రావు, నార్ల కాశీనాథ్‌గుప్తా, పుష్పలత, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రసన్న, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో బాధపడుతున్న వారి వివరాలు సేకరణ

నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూర్ పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న గ్రామాలలో ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు ప్రతి ఇంటికి వెళ్లి అనారోగ్యంతో బాధపడుతున్న వారి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా జ్వరంతో బాధపడుతున్న వారి వివరాలు సేకరించి రక్త పరీక్షలు చేస్తూ అనారోగ్యం బారిన పడుతున్న వారికి మందులు పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని దోమలు ఇంటిలోకి రాకుండా తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి యేమిమా, హెచ్ఓ వెంకటరమణ, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పొదుపుపై తపాలా శాఖ అవగాహన

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని సిద్ధరామేశ్వరనగర్ గ్రామంలో తపాలా శాఖ ఆధ్వర్యంలో తపాలా ఇన్‌స్పెక్టర్ సుజీత్ కుమార్ డాక్ కమ్యూనిటీ డెవలప్మెంట్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తపాలా శాఖ పొదుపు పథకాలు ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో సబ్ పోస్ట్ మాస్టర్ రాజేందర్‌రెడ్డి, బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ సుధాకర్, తపాలా సిబ్బంది సురేష్, సిద్ధరాములు, రామచంద్రం, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

చెరువులో దూకి మహిళ ఆత్మహత్య

నవతెలంగాణ-పిట్లం

జీవితంపై విరక్తి చెందిన ఓ మహిళ చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల కేంద్రంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానిక ఎస్సై రాజు వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన మండడి బశవ్వ (42) గత కొంతకాలంగా ఆస్తమాతో బాధపడుతోంది. గత సంవత్సరం క్రితం ఆమె తల్లి మరణించగా కృంగిపోయి జీవితంపై విరక్తి చెంది మంగళవారం ఉదయం ఊరి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి అన్న మండడి గంగారాం ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమ ఇసుక డంపులు గుర్తింపు

నవతెలంగాణ-పోతంగల్

మండలంలోని కోడిచెర్ల గ్రామంలో పోతంగల్ వెళ్లే దారిపక్కన మంగళవారం ఉదయం 10:30 గంటలకు దాదాపు 20 ట్రాక్టర్ ట్రిప్పుల అక్రమంగా నిలువ చేసిన 2 ఇసుక డంపులను గుర్తించి సీజ్ చేసినట్టు తహసీల్దార్ జె.మల్లయ్య తెలిపారు. ఈ ఇసుక నిలువలను బుధవారం 12 గంటలకు తహసీల్దార్ కార్యాలయంలో వేలం వేయనున్నట్టు పేర్కొన్నారు. ఈ వేలంలో పాల్గొనేవారు రూ.5000 చెల్లించి పాల్గొనవచ్చునని తహసీల్దార్ తెలిపారు. ఇకపై అక్రమంగా ఇసుక డంప్ చేసిన వారిని గుర్తించి, క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సీఎం విదేశీ పర్యటన విజయవంతం

- ఎమ్మెల్యే తోటా లక్ష్మి కాంతారావు

నవతెలంగాణ-మద్నూర్

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కోసం విశేషంగా కృషి చేస్తున్నారని రాష్ట్రంలో పెట్టుబడుల కోసం రూ.31,532 కోట్ల పెట్టుబడులతో అమెరికా పర్యటన విజయవంతం అయిందని ఎమ్మెల్యే తోటా లక్ష్మి కాంతారావు తెలిపారు. ఈ పెట్టుబడులతో దాదాపు 30,750 ఉద్యోగాలతో కొత్త చరిత్రకు శ్రీకారం లభించబోతుందని 19 కంపెనీలతో సంప్రదింపులు, ఒప్పందాలు జరిగాయని రాష్ట్ర ప్రభుత్వం ఎంచుకున్న వివిధ ప్రాజెక్టులకు విశేష స్పందన పెట్టుబడులకు నిజమైన గమ్యస్థానం తెలంగాణ సాధించబోతుందని పేర్కొన్నారు. విదేశీ పర్యటన ముగించుకొని ఈనెల 14న రాష్ట్రానికి తిరిగి వచ్చే ముఖ్యమంత్రికి శుభాకాంక్షలు తెలియజేశారు.

ముమ్మర ప్రచారం

నవతెలంగాణ-మద్నూర్

ఉమ్మడి మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్ష పదవికి జరుగుతున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ హైకమాండ్ ప్రతిపాదించిన అభ్యర్థిగా హనుమంతు యాదవ్ గెలుపు కోసం మంగళవారం పార్టీ సీనియర్ నాయకులు చౌలవార్ హనుమాన్లు స్వామి ఆధ్వర్యంలో యువకులు డోంగ్లి మండలంలోని మదన్‌ఇప్పర్గా, ఇలేగావ్, ఎనబోరా, ధోతి, తదితర గ్రామాల్లో ముమ్మరంగా పర్యటిస్తూ అభ్యర్థి గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మాదన్ ఇప్పర్గా గ్రామ మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఉమాకాంత్ పటేల్, అదేవిధంగా ఇలేగావ్ గ్రామ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులుగౌస్ పటేల్, అనిల్, యువకులు, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై తస్మాత్ జాగ్రత్త

నవతెలంగాణ-మద్నూర్

ఇటీవల కాలంలో రోజురోజుకు పెరుగుతున్న రకరకాల సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. మంగళవారం మద్నూర్ పాత బస్టాండ్ ఆవరణలో, మండలంలోని సలాబత్పూర్ గ్రామంలో ప్రజలకు సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పించారు. మోసాల కోసం రకరకాలుగా ఫోన్ కాల్ వస్తున్నా. ప్రజలు ఎలాంటి సమాచారం అడిగినా ఇవ్వవద్దని, జాగ్రత్తగా ఉండాలని పోలీసులు సూచించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ, కానిస్టేబుల్లు తదితరులు పాల్గొన్నారు.

పంచముఖి హనుమాన్ ఆలయంలో అన్నదానం

నవతెలంగాణ-పిట్లం

మండల కేంద్రంలోని బీడీ కార్మికుల కాలనీలోని పంచముఖి హనుమాన్ ఆలయంలో బొంతల నాగరాజ్ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా అన్నదానం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రావణ మాసం పురస్కరించుకొని బొంతల నాగరాజు ఆలయంలో కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బీడీ కార్మికుల కాలనీ కుటుంబ సభ్యులు, హనుమాన్ భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

డేటా, అనాలిటిక్స్ అంశంపై వర్క్‌షాప్

నవతెలంగాణ-సదాశివనగర్

తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల కామారెడ్డిలో డేటా, అనాలిటిక్స్ అనే అంశంపై వర్క్‌షాప్ మంగళవారం నిర్వహించారు. రవి కిరణ్, సీనియర్ మేనేజర్, ఫౌండెవర్-హైదరాబాద్, శ్రీ అరుణ్ రాజగోపాల్ పండిట్, డైరెక్టర్ కోఆర్డినేటర్, వరల్డ్ అసోసియేషన్ ఆఫ్ స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్, కుమారి సిరి చందన, అడ్మిన్ అండ్ హెచ్.ఆర్. ఎగ్జిక్యూటివ్, స్కాట్ లైన్ ఎల్.ఎల్.పి -హైదరాబాద్, డి.సురేష్ కుమార్, బిజినెస్ అనలిస్ట్ డేటా సైంటిస్ట్ అండ్ అనాలిస్ట్ మీసాల అశోక్ డేటా అనాలిస్ట్, ఆధ్వర్యంలో వర్క్ షాప్ ప్రోగ్రాంను కళాశాలలోని అన్ని గ్రూపుల విద్యార్థినులకు నిర్వహించారు. ఈ ప్రోగ్రాం ఆగస్ట్ 8, 9, 12 తేదీలలో మూడు రోజుల పాటు నిర్వహించినట్టు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.శోభారాణి, ప్లేస్మెంట్స్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.హిమబిందు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రావణి, ఉదయిని, విద్యార్థినిలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

ఎస్‌బీఐ ద్వారా నాణ్యమైన సేవలు

- చీఫ్ జనరల్ మేనేజర్ రాజేష్ కుమార్

నవతెలంగాణ-బోధన్



మాట్లాడుతున్న చీఫ్ జనరల్ మేనేజర్ రాజేష్ కుమార్

ఎస్.బీ.ఐ బ్యాంకు ద్వారా వినియోగదారులకు బ్యాంకు ఖాతాదారులకు నాణ్యమైన సేవలు అందిస్తున్నామని ఎస్‌బీఐ చీఫ్ జనరల్ మేనేజర్ రాజేష్ కుమార్ అన్నారు. మంగళవారం బోధన్ పట్టణంలోని ఎస్.బీ.ఐ బ్యాంక్‌ను ఆధునీకీకరించిన సందర్భంగా దానిని ప్రారంభోత్సవం చేసి మాట్లాడారు. బోధన్ ఎస్.బీ.ఐ బ్యాంక్ పరిధిలో 1658 పంట రుణాలు ఇవ్వడం జరిగిందని, అందులో 378 మంది రైతులకు రుణమాఫీ అయిందని తెలిపారు. మిగిలిన అర్హులైన రైతులకు ప్రభుత్వ నిర్ణయం మేరకు రుణమాఫీ వర్తింపచేస్తామని అన్నారు. బోధన్ మార్కెట్లో ఎస్.బీ.ఐ ఎంత శాతం షేర్ ఉందని విలేకరులు ప్రశ్నించగా బోధన్‌లో ఇతర బ్యాంకుల కంటే 35శాతం షేర్ ఉన్నట్లు తెలిపారు. ఎస్.బీ.ఐ బ్యాంక్ ద్వారా ఖాతాదారులకు మరిన్ని ఉత్తమ సేవలు అందించడానికి బ్యాంకును డిజిటలైజేషన్‌లో భాగంగా ఆధునీకీకరించడం జరిగిందని తెలిపారు.

ఖాతాదారుల సంఖ్యను బట్టి మరిన్ని బ్రాంచ్‌లు పెంచుతామని తెలిపారు. కార్యక్రమంలో నిజామాబాద్ డిజిఎం బిజయ్ కుమార్ సాహు, రీజినల్ మేనేజర్ కోలేటి మహేశ్వర్, బ్రాంచ్ మేనేజర్ ప్రదీప్ రాథోడ్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

- ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి
- బాన్సువాడ ఆర్డీఓ రమేష్ రాథోడ్

నవతెలంగాణ-బాన్సువాడ(నసురుల్లాబాద్)



భోజనాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ రమేష్ రాథోడ్

ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు నాణ్యమైన భోజనం, పౌష్టికాహారం అందించాలని ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని బాన్సువాడ ఆర్డిఓ రమేష్ రాథోడ్ తెలిపారు. మంగళవారం బాన్సువాడ మండలం బుడ్మి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని ఆర్డీవో రమేష్ రాథోడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు అందిస్తున్న భోజనం పట్ల నిర్లక్ష్యం చేయవద్దని నిర్వాహకులకు సూచించారు. పాఠశాలలను సందర్శించారు. ఉపాధ్యాయుల వివరాలను సేకరించారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని, మధ్యాహ్న భోజనాన్ని ఉపాధ్యాయులు పరిశీలించి విద్యార్థులకు అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో బషీరుద్దీన్, ఎంపీఓ సత్యనారాయణరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు ఖలీల్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

దళిత బంధు రెండో విడత నిధులు కేటాయించాలి




వినతిపత్రాన్ని అందజేస్తున్న లబ్ధిదారులు

నవతెలంగాణ-కామారెడ్డి

దళిత బంధు రెండవ విడత నిధులు కేటాయించాలని దళిత బంధు లబ్ధిదారులు అడిషనల్ కలెక్టర్‌కు మంగళవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దళితులు ఆర్థికంగా వెనుకబడి ఉన్నారని, వారి అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం అంబేద్కర్ అభయహస్తం పేరుతో రూ.12లక్షలు వెంటనే విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో కామారెడ్డి నియోజకవర్గంలోని బీబీపేట్, మాచారెడ్డి, పాల్వంచ, రాజంపేట్, భిక్కనూర్, దోమకొండ, కామారెడ్డి మండలాల దళిత బంధు లబ్ధిదారులు స్వామి, రాజు, నర్సింలు, ధన్‌రాజు, శంకర్, గంగాధర్, గంగారాం, ఎల్లం, లింగం, రామ స్వామి, సాయికుమార్, పరుశరాం, లబ్ధిదారులు, పాల్గొన్నారు.

ఎలుగుబంటి దాడి.. ఒకరికి గాయాలు

నవతెలంగాణ-లింగంపేట్



మండలంలోని పోల్కంపేట్ గ్రామ పరిధిలోని లక్కీనాయక్ తండాకు చెందిన లంబడి శ్రీనివాస్‌పై ఎలుగుబంటి దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. రోజువారీగా మేత కోసం అడవికి వెళ్లిన గేదెలను వెతకడానికి అడవికి మేడికుందా రాందాస్ గుడ్డం మీద గేదెలను వెతికే సమయంలో ఎలుగుబంటి దాడి చేసింది. అతను భయంతో చెట్టు ఎక్కే సమయంలో కాలును పట్టి కిందికి గుంజడంతో గాయాలయ్యాయి. అతని వెంట కుక్కలు ఉండడంతో పెనుప్రమాదం తప్పింది. ప్రస్తుతం ఆయన్ను అంబులెన్స్‌లో కామారెడ్డి ఏరియా హాస్పిటల్‌కు తరలించారు.

ఏఎంసీ చైర్మెన్‌గా అంకు సంధ్య

నవతెలంగాణ-బోధన్

వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గాన్ని ప్రభుత్వం ప్రకటించింది. మార్కెట్ కమిటీ చైర్మెన్‌గా అంకు సంధ్య, వైస్ చైర్మెన్‌గా హూన్స గ్రామ మాజీ ఎంపీటీసీ చీల శంకర్‌ను నియమించారు. డైరెక్టర్లుగా కర్నే గంగారాం, కండెపు వెంకటేశ్వర్రావు, నడిపోళ్ల వసంత్‌రెడ్డి, రమావత్ రవిదాస్, భూమయ్య స్మైల్, బొబ్బిలి శ్రీనివాస్, చేపూరి గంగా కిషోర్, నీరడి సాయన్న, బొర్రోళ్ల శ్రీనివాస్, సలీమ్ బేగ్, ఆవుల బాలకృష్ణరెడ్డి, చీకోటి అంజయ్య, మున్సిపల్ చైర్మెన్ పద్మ, మరో ఇద్దరు డైరెక్టర్లుగా నియమించారు. ఏఎంసీ చైర్మెన్ అంకు సంధ్య ప్రస్తుతం 26వ వార్డు కౌన్సిలర్‌గా ఉన్నారు.

బిజెపి ఆధ్వర్యంలో బైక్‌ర్యాలీ

నవతెలంగాణ-లింగంపేట్

మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో జాతీయ పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు మండలంలోని ప్రధాన వీధుల గుండా బైక్ ర్యాలీ నిర్వహించారు. జాతీయ పార్టీ రాష్ట్ర పార్టీ పిలుపుమేరకు ఈ నెల 11 నుంచి 14 వరకు స్వాతంత్ర సంబరాల దినోత్సవ సందర్భంగా మహాత్మాగాంధీ, డాక్టర్ సాహెబ్ అంబేద్కర్ విగ్రహాలను శుభ్రం చేసి పూలదండ తిరంగా వేశారు. మూడు రోజులపాటు కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు వివరించారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ జక్సాని, దత్తు రాములు, కో కన్వీనర్ వడ్ల రామ్‌చందర్, మండల అధ్యక్షుడు మాసుల శ్రీనివాస్, జిల్లా నాయకులు బొల్లారం సాయిలు, ఉదయ్, సంగీత, శ్రీకాంత్, బీజేవైఎం మండల అధ్యక్షులు మార్గం రజనీకాంత్, మండల ప్రధాన కార్యదర్శి నవీన్ కుమార్, ఓబిసి మండల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

చలో హైదరాబాద్‌కు తరలిన ఎమ్మార్పీఎస్ నాయకులు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు, ఎస్సీ వర్గీకరణ ఉద్యమానికి ఊపిరి పోసి నాయకత్వం వహించిన మహోన్నత వ్యక్తి మందకృష్ణ మాదిగ ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు వస్తున్న సందర్భంగా ఆయనకు ఘనస్వాగతం పలకడానికి ఎల్లారెడ్డి మండల నాయకులు, ఎంఎస్పీ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కంతి పద్మారావు ఆధ్వర్యంలో హైదరాబాద్‌కు మంగళవారం తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 30 ఏళ్లుగా ఎస్సీ వర్గీకరణ సాధన కోసం అలుపెరుగని పోరాటం చేసి, విజయం సాధించిన మందకృష్ణకు ఘన స్వాగతం పలకడానికి వెళ్లడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో పోచయ్య తిమోతి, యాదగిరి, ప్రభాకర్, నాగరాజు, సుధాకర్, సాయిబాబా, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.